
# ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శుక్రవారం, 2 మే 2025
5




**పెద్దవాగు ప్రాజెక్టుకు మహర్దశ**

- 82 శాతం వాటా చెల్లించనున్న ఏపీ
- తెలంగాణ ప్రతిపాదనలకు ఏపీ ప్రభుత్వం సానుకూలం
- ఫలించిన తెలంగాణ ప్రజా ప్రతినిధులు, అధికారుల కృషి

7



కొత్తగూడెంలో మే డే జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



మణుగూరు ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పాయం



ఖమ్మంలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం

# వాడవాడలా ఎగిరిన ఎర్రజెండా

- ఉద్యమస్ఫూర్తితో సాగిన మే డే వేడుకలు
- పాల్గొన్న కార్మిక సంఘాల జాతీయ, రాష్ట్ర నాయకులు
- సింగరేణి గనుల వద్ద ఘనంగా వేడుకలు
- ఖమ్మంలో తమ్మినేని వీరభద్రం... కొత్తగూడెంలో కూనంనేని...

6

## ఎంసీఐ సర్టిఫికెట్ లేకుండా వైద్యం

### వైరాలో వైద్యుడిపై కేసు నమోదు

వైరా, మే 1 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) సర్టిఫికెట్ లేకుండా వైరాలో వైద్యం చేస్తున్న కేఎంఆర్ హాస్పిటల్‌కు చెందిన కె.మోహన్‌రావుపై కేసు నమోదు చేశామని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రవి తెలిపారు. బుధవారం రాత్రి వైరా మెడికల్ అధికారితో కలిసి టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆస్పత్రిలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఖర్గిస్తాన్‌లో ఎంబీబీఎస్ చదివిన మోహన్‌రావు... ఎంసీఐ సర్టిఫికెట్ పొందకుండానే వైరాలో డాక్టర్‌గా చలామణి అవుతూ రోగులకు వైద్యం చేస్తున్నట్లు గుర్తించామన్నారు. సర్టిఫికెట్ లేకుండా వైద్యం చేయటం అక్రమం, శిక్షార్హమైన నేరమని ఆయన తెలిపారు. వైద్యం చేయడానికి ఎంసీఐ లేక రాష్ట్ర వైద్య కౌన్సిల్ (ఎస్‌ఎంసీ)లో రిజిస్టర్ అయి ఉండాలని, ఎలాంటి సర్టిఫికెట్లు లేకుండా వైద్యం చేయడం నేరమని ఏసీపీ తెలిపారు. మెడికల్ అధికారి ఫిర్యాదు మేరకు మోహన్‌రావుపై వైరా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశామని తెలిపారు. అలాగే హనూక్ ఐకేర్ సెంటర్‌కు సంబంధించిన అనుమతులపై కూడా వైరా పోలీస్‌స్టేషన్‌లో విచారణ సాగుతుందని వారిపై కూడా చర్యలు తీసుకుంటామని ఏసీపీ తెలిపారు.



సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ నమూనా

## అథ్లెటిక్స్‌కు వరం

- నగరంలోని ఎస్పీ స్టేడియంలో సింథటిక్ ట్రాక్
- రూ.8.50 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మాణం
- జాతీయ, అంతర్జాతీయ పోటీలకు వేదిక కానున్న ఖమ్మం
- నేడు భూమిపూజ చేయనున్న మంత్రి తుమ్మల

ఖమ్మం స్పోర్ట్స్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియం ఆధునిక హంగులను సంతరించుకోనుంది. ఇక్కడ సుమారు రూ.8.50 కోట్లతో సింథటిక్ ట్రాక్ (400మీటర్లు 8 వరుసలు) ఏర్పాటు చేయబోతున్నారు. ఈ మేరకు శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ట్రాక్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఇప్పటికే స్టేడియంలో ఉన్న అన్ని క్రీడా ప్రాంగణాలు, వసతి గదులు అభివృద్ధి చెందగా అథ్లెటిక్స్ క్రీడాకారులు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న సింథటిక్ ట్రాక్ కల కూడా ఫలించబోతోంది. ఈ స్టేడియంలో శాట్స్‌కు చెందిన అథ్లెటిక్స్ అకాడమీ సైతం ఉండటంతో పాటు నగరంలోని క్రీడాకారులు అథ్లెటిక్స్ విభాగంలో రాణిస్తున్నారు. ఇప్పటికే జిల్లాకు చెందిన పలువురు అథ్లెట్లు పలు రాష్ట్ర, జాతీయ పోటీల్లో రాణించి పతకాలు సాధించారు. ఈ నేపథ్యంలో ఎస్పీ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేయాలని క్రీడా నిపుణులు సూచించారు. ఈ నేపథ్యంలోనే సింథటిక్ ట్రాక్ మంజూరు కావడంతో క్రీడాకారులు, క్రీడాభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**ఎనిమిది వరుసల ట్రాక్**

స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు 2019లో బీజం పడింది. నాటి పాలకులు రూ.6 కోట్లతో 6 వరుసల ట్రాక్ నిర్మాణానికి (మిగతా 6వ పేజీలో)



మోరంపల్లిబంజర కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం



కొణిజర్ల మండలం తుమ్మలపల్లిలో కూలిన కృష్ణయ్య ఇల్లు



వైరాలో తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతులు

# గాలి వాన బీభత్సం

- రాలిన మామిడికాయలు.. నేలకూలిన చెట్లు, కరెంటు స్తంభాలు
- లేచిపోయిన ఇళ్ల పైకప్పులు
- ఉమ్మడి జిల్లాలో అకాల వర్షాలతో ఆగమవుతున్న రైతులు
- ఆదుకోవాలని బాధితుల విజ్ఞప్తి

## కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో నీటిపాలైన ధాన్యం రాశులు

కొత్తగూడెం/ఖమ్మం సాంస్కృతికం, మే 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో బుధవారం రాత్రి, గురువారం వివిధ ప్రాంతాల్లో గాలి దుమారంతో పాటు అకాల వర్షాలు కురిశాయి. కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు తడిసిపోయాయి. మామిడికి తీవ్ర నష్టం వాటిల్లింది. గాలిదుమారానికి చెట్లు, విద్యుత్‌స్తంభాలు నేలకొరిగాయి. ఇళ్ల పైకప్పులు లేచిపోయాయి. పిడుగులు పడటంతో మేకలు మృత్యువాత పడ్డాయి.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బుధవారం రాత్రి గాలిదుమారంతో వర్షం బీభత్సాన్ని సృష్టించింది. బూర్గంపాడు, పాల్వంచలో, అశ్వాపురం, భద్రాచలం, మణుగూరు, కొత్తగూడెం, ఇల్లెందు, టేకులపల్లి, మణుగూరు, కరకగూడెం, దుమ్ముగూడెం, సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, జూలూరుపాడు, చండ్రుగొండ, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి తదితర మండలాల్లో వర్షం కురిసింది. అక్కడక్కడ గాలిదుమారానికి చెట్లు, విద్యుత్‌స్తంభాలు నేలకొరిగాయి. పాల్వంచ, అశ్వాపురం, మణుగూరు మండలాల్లోని కల్లాల్లో ఉన్న ధాన్యం తడిచింది. మామిడి తోటల్లో గాలిదుమారానికి మామిడికాయలు నేలరాలాయి. జూలూరుపాడు, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి మండలాల్లో మామాడి తోటల్లో కాయలు నేలరాలాయి. పెద్దఎత్తున వర్షం కంటే గాలి దుమారం రావడంతో బూర్గంపాడు మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై పెద్ద చెట్టు ఆర్టీసీ బస్సుపై పడటంతో తృటిలో ప్రమాదం తప్పింది. మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం తడిసిపోయింది.



బచ్చోడు ఐకేపీ కేంద్రంలో తడిసిన ధాన్యం

ఏజెన్సీ ప్రాంతంలోని పలు గ్రామాల్లో ఒక్కసారిగా గాలి, వాన, ఉరుములు, మెరుపులు బీభత్సం సృష్టించింది. పాల్వంచ మండలంలోని ఉల్వనూరు, మందెరికలపాడు, లక్ష్మీదేవిపల్లి గ్రామ పంచాయతీల్లో గాలి, వాన బీభత్సంతో గృహాలు పూర్తిగా దెబ్బతినగా విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. రోడ్లపై చెట్లు పడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పాల్వంచ మండలంలో సుమారు 30పైగా గృహాలు దెబ్బతిన్నాయి. ఓ పెళ్లి ఇల్లు పై కప్పు పూర్తిగా గాలికి లేచిపోవడంతో అడ్డంగా ఉన్న ఓ దూలానికి ఫ్యాన్ మాత్రమే మిగిలి ఉంది. ఆ పెళ్లి ఇంట్లో ఒక్కరు కూడా లేకుండా తలా ఓ దిక్కు (మిగతా 6వ పేజీలో)

### మూడు రోజులపాటు
## మంత్రి తుమ్మల పర్యటన



ఖమ్మం కలెక్టరేట్, మే 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లాలో మూడు రోజుల పాటు పర్యటించనున్నారు. ఆయన శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ఐటీహబ్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ఫుట్‌పాత్ నిర్మాణం కోసం శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం 5.15కి సర్దార్ పటేల్ స్టేడియంలో సింథటిక్ రన్నింగ్ ట్రాక్, టేబుల్ టెన్నిస్ హాల్‌కు శంకుస్థాపన చేస్తారు. ఆ తర్వాత సీఎం కప్ విజేతలకు బహుమతులను అందజేస్తారు. శనివారం ఉదయం 9 గంటలకు 44వ డివిజన్‌లో రైతు మార్కెట్‌లో షెడ్ల నిర్మాణం కోసం శంకుస్థాపన చేస్తారు. ఉదయం 9.30కి 7వ డివిజన్ టేకులపల్లిలో సైడ్‌డ్రెయిన్లకు శంకుస్థాపన చేస్తారు. ఆదివారం ఉదయం 9గంటలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో నర్సింగ్‌హోంను ప్రారంభిస్తారు. 10 గంటలకు కొత్తగూడెం నగరంలో ఎన్‌కే నగర్‌లో మినీ ఫంక్షన్‌హాల్‌కు శంకుస్థాపన చేస్తారు. 10.30కి పోస్టాఫీస్ సెంటర్‌లో మాజీ జడ్పీ ఛైర్మన్ చేకూరి కాశయ్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు.

## 90 గంజాయి చాక్లెట్ల సీజ్

ఖమ్మం రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం రూరల్ మండల పరిధిలోని ఆరెంపుల సమీపంలోని ఓ గ్రానైట్ ఫ్యాక్టరీ వద్ద గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు గురువారం సాయంత్రం తనిఖీలు చేపట్టారు. తిరుమలాయపాలేనికి చెందిన కొమ్ము ప్రభాకర్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన చోటాఖాన్ అనే ఇద్దరు వ్యక్తుల నుంచి 90 గంజాయి చాక్లెట్లు సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు.



## అభివృద్ధి మాటున ఇసుక అక్రమ తవ్వకాలు

- ఎక్కడపడితే అక్కడ ఇసుక ర్యాంపులు
- నిర్మాణాలకు నాణ్యతలేని ఇసుక తోలకాలు
- చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్న రెవెన్యూ, అటవీశాఖ అధికారులు
- పనులను పరిశీలించాలి: ఆళ్లపల్లి మండల వాసుల విజ్ఞప్తి

6

# కొనలేం.. దాచలేం...

- మిల్లుల్లో పేరుకుపోయిన వానాకాలం ధాన్యం నిల్వలు
- ఖాళీ లేదని ధాన్యం దింపుకోని మిల్లర్లు
- హన్మకొండకు 50 వేల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ధాన్యం కేటాయింపు
- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కొర్రీలు
- అకాల వర్షాలతో రైతుల్లో ఆందోళన
- పచ్చి ధాన్యాన్నే మిల్లర్లకు అమ్ముకుంటున్న వైనం



మిల్లుల వద్ద ధాన్యం నిల్వలు

ఖమ్మం, మే 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో సరిపడా రైస్ మిల్లులు లేకపోవడం, గత వానాకాలంలో సీఎంఆర్ కింద కేటాయించిన ధాన్యం ఇంకా మిల్లుల్లో పేరుకుపోయి యాసంగి ధాన్యాన్ని నిల్వ చేసేందుకు గోదాములు లేకపోవడం వంటి కారణాలు ధాన్యం కొనుగోళ్లకు ప్రధాన సమస్యగా మారాయి. దీనికితోడు ప్రస్తుతం అకాల వర్షాలు కురుస్తుండడంతో పలుచోట్ల కల్లాల్లో ధాన్యం తడిచి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఉత్పత్తి అయిన ధాన్యాన్ని సీఎంఆర్ కింద ఇతర జిల్లాల్లోని మిల్లులకు కేటాయిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దాంతో ప్రస్తుతం హన్మకొండ జిల్లాలోని 14 పార్‌బాయిల్డ్, 16 చిన్న, మధ్య తరహా రైస్ మిల్లులకు 50వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని గురువారం నుంచి ఆ జిల్లాకు పంపిస్తున్నారు. త్వరలో నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు కూడా సీఎంఆర్ ధాన్యం కేటాయింపులు చేసే అవకాశం ఉంది.

**ఖాళీ లేని గోదాంలు..**

జిల్లాలో ఈ ఏడాది వానాకాలంతో పాటు యాసంగిలోనూ ధాన్యం భారీగా ఉత్పత్తి అయ్యింది. ప్రభుత్వం యాసంగిలో 2.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని భావించి 351 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. జూన్ 30 వరకు ధాన్యం కొనుగోలు జరగనుంది. ఇప్పటికే జిల్లాలో 58,154 మె.ట ధాన్యం కొనుగోలు చేశారు. ప్రతిరోజు జిల్లా నుంచి 500పైగా లారీలు ధాన్యం మిల్లులకు ఎగుమతి చేస్తున్నాయి. అయితే జిల్లాలో ఉన్న 70 రైస్ మిల్లులకు సీఎంఆర్ కింద ధాన్యం కేటాయింపులు చేసినా.. కొన్ని మిల్లుల్లో వానాకాలంలో కేటాయించిన సీఎంఆర్ ధాన్యమే లాట్లుగా పేరుకుపోయి ఉంది. దాంతో ప్రస్తుతం మిల్లులకు ధాన్యాన్ని పంపుతున్నా గోదాంలు ఖాళీగా లేకపోవడంతో మిల్లర్లు ధాన్యం దింపుకోవడంలేదు. హమాలీల కొరత కూడా మిల్లర్లను వెంటాడుతోంది.

**తగ్గుతున్న బియ్యం శాతం..**

మరోవైపు యాసంగి ధాన్యంలో నాణ్యత లోపించి క్వింటాకు వచ్చే బియ్యం శాతం తగ్గుతోందని మిల్లర్లు పేర్కొంటున్నారు. ప్రభుత్వానికి (మిగతా 6వ పేజీలో)

## ఇష్టారాజ్యంగా దీర్ఘకాలిక సెలవులు

- ఏడాదిగా విధులకు డుమ్మా
- వైద్య, ఆరోగ్యశాఖలో ఓ మహిళా అధికారి తీరు
- ఉదాసీనంగా వ్యవహరిస్తున్న అధికారులు



ఖమ్మం కలెక్టరేట్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఏడాది కాలంగా ప్రభుత్వ వేతనం తీసుకుంటూ.. మాయరోగం పేరుతో విధులకు డుమ్మా కొడుతుంటే మన అధికారులు మాత్రం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూస్తూ ఊరుకుంటున్నారు. ఆమె చక్కబెట్టాల్సిన ఎయిడ్స్, లెప్రసీ విభాగంలో పనులన్నీ మూలనపడితే ఏదో ఒక అధికారికి ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించి నెట్టుకొస్తున్నారు. ఇంతకీ ఆ కథాకమామీషు ఏంటంటే....

ఖమ్మం జిల్లాలో వైద్య, ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఓ మహిళా అధికారి అనారోగ్యం పేరుతో విధులకు డుమ్మా కొడుతున్నారు. ఈమె ఏడాది నుంచి విధులకు గైర్హాజరవుతున్నారు. 2018 నుంచి ఖమ్మంలో విధులు నిర్వహిస్తున్న ఆమె 2019లో కొత్తగూడెం భద్రాద్రి జిల్లాలో ఇన్‌చార్జి బాధ్యతలపై వెళ్లారు. ఆ తర్వాత 2024లో డిప్యూటేషన్ రద్దుచేసి యథాస్థానం ఖమ్మంలో తిరిగి పోస్టింగ్ కల్పించారు. 2024 మేలో తిరిగి ఖమ్మంలో చేరిన ఆమె పట్టుమని పదిరోజులు కూడా విధులు నిర్వహించలేదు. గతేడాది మేలో చేరిన ఆమె జూన్, జూలై సెలవు పెట్టారు. పాల్వంచ నుంచి రాకపోకలు సాగిస్తున్న ఆమె 2024 సెప్టెంబర్ నుంచి 2025 ఫిబ్రవరి వరకు తిరిగి సెలవులో వెళ్లిపోయారు. మార్చిలో విధుల్లో చేరిన ఆమె తిరిగి మార్చి 10 నుంచి దీర్ఘకాలిక సెలవులో వెళ్లిపోయారు. ఆమె తన సొంత ప్రాంతంలో ప్రాక్టీస్ నిర్వహించుకుంటూ ఇక్కడ సర్కారు కొలువుకు ఎగనామం పెడుతున్నా.. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఆమెపై ఏమైనా చర్యలకు సిఫారస్ చేసినా తమకున్న పలుకుబడితో వాటిని చక్కదిద్దుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ఇంతటి కీలకమైన పోస్టుపై ప్రత్యేక దృష్టి సారించి డుమ్మా అధికారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయిని వివరణ కోరగా, ఈ విషయమై జిల్లా, రాష్ట్ర ఉన్నతాధికారులకు ప్రతి నెల నివేదికల్లో పంపిస్తూనే ఉన్నామని తెలిపారు. మరో మారు ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు.

### కంచి కామకోటి పీఠం ఉత్తరాధికారికి

## భద్రాద్రి దేవస్థానం మర్యాద

భద్రాచలం, మే 1 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు కాంచీపురంలోని కంచికామకోటి పీఠం ఉత్తరాధికారిగా బాధ్యతలు స్వీకరించిన సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి వారికి భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం తరఫున ఆలయ మర్యాదను సమర్పించారు. బుధవారం కంచికామకోటి పీఠం ఉత్తరాధికారిగా సత్యచంద్రశేఖర సరస్వతి స్వామి బాధ్యతలు స్వీకరించారు. ఈ క్రమంలో భద్రాద్రి దేవస్థానం తరఫున పట్టు వస్త్రం, పవిత్రాలు, స్వామి వారి శాలువ, విశేష ప్రసాదం, జ్ఞాపిక, సీతారాముల కల్యాణ ముత్యాల తలంబ్రాలను దేవస్థానం సామవేద పండితులు ద్వివేదుల సత్యసాయి సన్యాసి శర్మ సమర్పించారు. అలాగే ప్రస్తుత పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారికి సైతం మర్యాద సమర్పించగా ప్రశంసిస్తూ అనుగ్రహం అందజేశారు.

అధికారులకు నచ్చితే చట్టాలను చుట్టాలుగా మార్చి అక్రమార్కులకు మెత్తటి తివాచీ పరుస్తారు. లేదంటే చిన్న తప్పును కూడా వెతికి మరీ శిక్షిస్తారు. ఇదీ ఆళ్లపల్లి మండలంలోని అధికారుల పరిస్థితి. వారికి నచ్చితే అనుమతులు ఉన్నాయని, నచ్చకుంటే చట్టాన్ని గుర్తు చేసి వాహనాలు పట్టుకోవడం, రాత్రికి రాత్రి వదిలేయడం, మళ్లీ అనుమతి ఉందనడం పరిపాటిగా మారింది.



అనుమతి లేకుండా ఒకే చోట రాశిగా పోసిన ఇసుక

### అభివృద్ధి మాటున

# ఇసుక అక్రమ తవ్వకాలు

- ఎక్కడపడితే అక్కడే ఇసుక ర్యాంపులు
- నిర్మాణాలకు నాణ్యతలేని ఇసుక తోలకాలు
- చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న రెవెన్యూ, అటవీశాఖ అధికారులు
- పనులను పరిశీలించాలంటున్న ఆళ్లపల్లి మండల వాసులు

ఆళ్లపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): ఆళ్లపల్లి మండలంలో జరుగుతున్న బ్రిడ్జిలు, కల్వర్టులు, సీసీ రోడ్లు, ప్రభుత్వ భవనాలు, ఇతర మండలాల్లో నిర్మిస్తున్న డ్రెయినేజీలు, సీసీ రోడ్లకు అవసరమైన ఇసుకను అభివృద్ధి పనుల పేరిట, అధికారుల అండతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా కిన్నెరసాని, జల్లేరు, కొడేల, చింతలపడి వాగు పరివాహక వాగుల్లో అనుమతులు లేని ర్యాంపులు నుంచి తెచ్చి నిర్మాణాలకు ఉపయోగిస్తున్నట్టు విమర్శలు వస్తున్నాయి. అభివృద్ధి నిర్మాణ పనులకు అవసరమైన ఇసుకను సంబంధిత అధికారులు పరిశీలన చేసి ప్రభుత్వ అనుమతి ఉన్న ర్యాంపుల నుంచి ఇసుకను సరఫరా చేయాల్సి ఉంటుంది. కానీ ఆళ్లపల్లి మండలంలో రెవెన్యూ, మైనింగ్, అటవీశాఖ అధికారులు చట్టాలను తుంగలో తొక్కి, ఏ ఆధారాలు లేకుండానే కేవలం ఒక్క కలెక్టర్ మాటతో ఇసుక ర్యాంపులకు నచ్చిన వారికి అనుమతి ఇస్తూ అప్పగిస్తున్నారు. ఇంతకు ఆ ఇసుక నిర్మాణాలకు పనికి వస్తుందా..? లేదా అనేది పరిశీలించకుండానే, కాంట్రాక్టర్లు నిర్మాణాలకు లెక్కకు మించి వాగుల్లో నుంచి ఇసుకను బయటకు తోడేస్తున్నారు. ఇలా ఇష్టారాజ్యంగా ఇసుక తోలకాలతో కిన్నెరసాని, జల్లేరుతో పాటు ఇతర ఒర్రెలో భూగర్భజలాలు అడుగంటిపోయి తాగునీటి కటకట ఏర్పడుతోంది. అభివృద్ధి పనుల మాటేమో కాని, ఆ పనుల పేరిట వాగుల్లోని నాణ్యతలేని ఇసుకను పని నిర్వహించే చోటుకు తరలించి, మంచి ఇసుకను రాత్రి సమయాల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఇసుక రవాణలో అధికారులకు నచ్చితే ఎక్కడినుంచైనా ఇసుకను తీసుకోవచ్చని పచ్చజెండా ఊపడం, లేదంటే చట్టాలను గుర్తు చేసి, ఇసుక వాహనాలను పట్టుకోవడం, ఫైన్ వేయడం, మంతనాలు జరిపి రాత్రికి రాత్రి విడిచిపెట్టడం పరిపాటిగా మారింది. ఇటీవల ఓ అభివృద్ధి పనికి ఇసుక తోలుతుండగా రెవెన్యూ అధికారులు నిలిపివేయగా, వారం తరువాత మళ్లీ ఇసుక తోలకాలు మొదలయ్యాయి. గతంలో అభివృద్ధి నిర్మాణానికి ఇసుక తరలిస్తున్న క్రమంలో అటవీశాఖ అధికారులు అనుమతి లేదంటూ ఒక ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లు పట్టుకున్న సంఘటనలు ఉన్నాయి. గతేడాది రెవెన్యూ అధికారులు బోడాయికుంట బ్రిడ్జికి ఇసుకకు అనుమతి ఇవ్వగా, ఇసుక తోలుతున్న ట్రాక్టర్లను అనుమతి లేదని పోలీసులు పట్టుకోవడం గమనార్హం. ఆళ్లపల్లి మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఇసుక తోలకాలపై, చట్టాలను కాదని ఎవరు అనుమతి ఇచ్చారు? ఎవరు ఇసుక తీస్తున్నారు..? ఎక్కడికి తీసువెళ్తున్నారు? అనే విషయంలో రెవెన్యూ, అటవీశాఖ, పోలీస్ అధికారులు అక్రమ రవాణాపై దృష్టిపెట్టాలని, మండలంలో జరుగుతున్న అభివృద్ధి నిర్మాణ పనులపై ఆయా శాఖకు సంబంధించిన ఈఈ, డీఈలు నాణ్యత లేని పనులపై పర్యవేక్షించాలని, ఆళ్లపల్లి మండల ప్రజలు, రాజకీయ పార్టీ నాయకులు కోరుతున్నారు.

## భద్రాద్రి జిల్లాలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు షురూ

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మే 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు - 2025 గురువారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో తొలిసారిగా కొత్తగూడెం, అశ్వారావుపేట, ఇల్లెందు, పినపాక, భద్రాచలం నియోజకవర్గాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాల సంఖ్యను 35 ప్రాంతాల్లో నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌వో పరందామరెడ్డి తెలిపారు. ప్రతీ ఏడాది పది ప్రాంతాల్లోనే ఈ శిబిరాలు ఉండేవని, ఈ ఏడాది ఉత్తమ, నాణ్యమైన క్రీడాకారులను వెలికి తీసే ఉద్దేశంతో వివిధ క్రీడా విభాగాల్లో మునుపెన్నడూ లేని విధంగా శిబిరాలను నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు.



చుంచుపల్లిలో ప్రారంభమైన యోగా శిక్షణ తరగతులు

ఉదయం ఆరు నుంచి ఎనిమిది గంటల వరకు, సాయంత్రం ఐదు గంటల నుంచి ఏడు గంటల వరకు ఈ శిక్షణ శిబిరాలు కొనసాగుతాయని అన్నారు. ఈ శిబిరాల్లో సాఫ్ట్‌బాల్, రైఫిల్ షూటింగ్, ఫుట్‌బాల్, తైక్వాండో, యోగా, బాక్సింగ్, ఉషు, క్రికెట్, బాస్కెట్‌బాల్, కరాటే, చెస్, టెన్నీస్, టేబుల్ టెన్నీస్, హాకీ, వాలీబాల్, అథ్లెటిక్స్ రెజ్లింగ్, ఆత్యపత్య తదితర విభాగాలలో ఈ శిక్షణ తరగతులు ఈ నెల 31 తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు. 14 సంవత్సరాలలోపు బాల, బాలికలు క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా యువజన క్రీడల శాఖచే నియమించిన కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరాలు వెల్లడించారు. కావున క్రీడాకారుల తల్లిదండ్రులు, సంరక్షకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.



లక్ష్మీదేవిపల్లిలో ప్రారంభమైన కరాటే తరగతులు

### ఉద్యాన అధికారుల సంఘ అధ్యక్షుడిగా సందీప్, మహిళా అధ్యక్షురాలిగా అనితశ్రీ



సందీప్ కుమార్



అనితశ్రీ

ఖమ్మం వ్యవసాయం, మే 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉద్యాన అధికారుల సంఘం (టీజీహెచ్‌వో) రాష్ట్ర అధ్యక్షుడిగా ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం చిన్న మునగాల గ్రామానికి చెందిన గుడిమళ్ల సందీప్ కుమార్ ఎన్నికయ్యారు. గురువారం హైదరాబాద్‌లోని టీజీవో కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో సందీప్ కుమార్ విజయం సాధించారు. సందీప్ కుమార్ ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఐటీడీఏ (సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ)లో ప్రాజెక్ట్ ఉద్యాన అధికారిగా (పీహెచ్‌వో) విధులు నిర్వహిస్తున్నారు. సందీప్ కుమార్ గతంలో పదేళ్లపాటు (2013 -2023) ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వివిధ ప్రాంతాల్లో (ఇల్లెందు, అచ్యుతాపురం ఉద్యాన నర్సరీ, ఖమ్మం) ఉద్యాన అధికారిగా పని చేసి, రైతుల్లో మంచి గుర్తింపు పొందారు. మహిళా అధ్యక్షురాలిగా ఖమ్మం సాంకేతిక ఉద్యాన అధికారిగా విధులు నిర్వహిస్తున్న అనితశ్రీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడిగా సందీప్ కుమార్, మహిళా అధ్యక్షురాలిగా అనితశ్రీ ఎన్నికవ్వటం, వీరిద్దరూ జిల్లా వాసులే కావడం గమనార్హం.



### గురుకులాల సమన్వయ అధికారిగా అరుణకుమారి

భద్రాచలం, మే 1 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం రీజియన్ గురుకులాల సమన్వయ అధికారిణిగా అరుణకుమారి నేడు బాధ్యతలు చేపట్టనున్నారు. ఐటీడీఏ కార్యాలయంలో గురుకులం ఆర్సీవోగా పని చేసిన నాగార్జునరావు మేడ్చల్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో అంకంపాలెం గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న అరుణకుమారిని ఐటీడీఏ గురుకులం ఆర్సీవోగా నియమిస్తూ గురుకులం కార్యదర్శి సీతాలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో నేడు అరుణకుమారి బాధ్యతలు చేపట్టనున్నారు.

## గాలి వాన బీభత్సం

(5వ పేజీ తరువాయి)

చేరుకున్నారు. లక్ష్మీదేవిపల్లి గ్రామంలో చింతగుంప జయసుధ కుమార్తె వివాహ వేడుకల అనంతరం గాలి, వానకు ఆ ఇంటి పైకప్పు అంతా లేచిపోవడంతో ఇంట్లోని బంధువులతో సహా భయంతో చుట్టు పక్కల ఇళ్లలోకి పరుగులు తీశారు. ఉల్వనూరులో పిడుగుపడటంతో మేకలు మృత్యువాత పడ్డాయి. లక్ష్మీదేవిపల్లి ప్రాంతంలో బాదావత్ మోతీలాల్, బంగారు శ్రీను, లక్ష్మయ్య గృహాలు నేలమట్టమయ్యాయి. రేకులు, గడ్డిళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. మందరికలపాడులో రేకుల ఇళ్లపై చెట్లు పడటంతో పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఉల్వనూరు, లక్ష్మీదేవిపల్లి, గంగదేవిపల్లి గ్రామపంచాయతీల్లో గాలివాన బీభత్సానికి సుమారు 30 గృహాలు దెబ్బతిన్నాయి. స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులు పరిశీలించారు.

ఖమ్మం జిల్లాలో గురువారం తీవ్ర గాలిదుమారంతోపాటు ఒక మోస్తరు వర్షం కురిసింది. పగలంతా తీవ్ర ఎండ వేడిమితో అల్లాడిన ప్రజలకు వాతావరణ మార్పు ఉపశమనం కలిగించింది.. చల్లని గాలులు వీయటంతో ఉక్కబోత వాతావణంతో ఇబ్బందులు పడుతున్న వారు కొంత ఊరట చెందారు.. కాగా గాలి దుమారం, వర్షం కారణంగా రైతులు తీవ్ర నష్టానికి గురయ్యారు. ఒక్కసారిగా వాతావరణం మారిపోవటంతో రైతులు గ్రామాల్లో పంటలను కాపాడుకునేందుకు ఉరుకులు పరుగులు తీశారు. వరిధాన్యంపై రక్షణ పట్టాలను కప్పేపనుల్లో నిమగ్నమయ్యారు. వైరా, కామేపల్లి, సింగరేణి, సత్తుపల్లి, మధిర, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ తదితర మండలాల్లో గాలి దుమారం , అకాల వర్షం ఇబ్బందులు సంభవించాయి. బలమైన గాలులు వీయటంతో కోతకు వచ్చిన మామిడి కాయలు నేల రాలటంతో రైతులకు నష్టం వాటిల్లింది. మామిడి కాయలను కోసి మార్కెట్‌లో విక్రయానికి తరలించే తరుణంలో ఒక్కసారిగా సంభవించిన వాతావరణ మార్పు అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లింది.. మరో వంక కల్లాల్లో ఉంచిన వరి ధాన్యం సైతం తడవటం, వరదకు గురి కావటంతో వరి రైతులకు విపరీత నష్టం కలిగింది.



గాలివానకు ఇంటిపై కప్పు లేచిన దృశ్యం

రైతుల పొలాల్లోని కల్లాలతోపాటు మార్కెట్‌కు తరలించిన రైతుల ధాన్యానికి సైతం అకాల వర్షం అగచాట్లు తప్పలేదు. మార్కెట్లలో అందుబాటులో ఉన్న టార్పాలిన్లు కప్పటంతో కొంత మేరకు పంటను రక్షించుకోగలిగారు. జిలా వ్యాప్తంగా 127.2 మిల్లీ మీటర్ల వర్షం కురవగా అత్యధికంగా వైరాలో 24.2 మిల్లీమీటర్లు, కామేపల్లిలో 17.6, సింగరేణిలో 16.8, సత్తుపల్లిలో 16.6, మధిరలో 13.6, పెనుబల్లి 10.2, తల్లాడ 8.4, కల్లూరు 6.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

## వాడ వాడలా ఎగిరిన ఎర్రజెండా



ర్యాలీలో పాల్గొన్న నాయకులు

ఖమ్మం సంక్షేమ విభాగం/కొత్తగూడెం, మే 1 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులపై పోరాటాలు కొనసాగిస్తామంటూ ఖమ్మం జిల్లా వ్యాప్తంగా మేడే వేడుకలు కార్మిక ఉద్యమ స్ఫూర్తితో ఘనంగా నిర్వహించారు. దశాబ్దాలుగా కార్మిక సంఘాలు అనేక ఆమరణ నిరాహార దీక్షలు, కార్మికుల ప్రాణత్యాగాలతో సాధించుకున్న కార్మిక చట్టాలు, కార్మిక హక్కుల్ని బీజేపీ ప్రభుత్వం లేబర్ కోడ్‌లను అమల్లోకి తీసుకొచ్చి కాలరాసిందని కార్మిక సంఘాల రాష్ట్ర నాయకులు ఆరోపించారు. ఖమ్మం త్రీ టౌన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ సభలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం పాల్గొని ప్రసంగించారు. అనంతరం నిర్వహించిన ర్యాలీలో రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్‌రావు పాల్గొన్నారు.

వైరా రోడ్డులో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జాతీయ నాయకుడు బాగం హేమంతరావు జెండావిష్కరణ చేశారు. టీయూసీఐ ఆధ్వర్యంలో ఖమ్మం బైపాస్ రోడ్డులో భారీ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర నాయకులు గోకినేపల్లి వెంకటేశ్వరరావు, జీ రామయ్య పాల్గొన్నారు. సీపీఎం కార్యాలయంలో జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, పలు డివిజన్ కార్యాలయాల్లో డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ కార్మికుల జెండాలను ఎగురవేశారు.

### భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో..

భద్రాద్రి జిల్లాలో గురువారం మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కొత్తగూడెంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని, పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే.సాబీర్‌పాషా ఆధ్వర్యంలో కొత్తగూడెం, పాల్వంచ పట్టణంలో మేడే జెండాలను ఎగురవేసి కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు మేడే జెండాను ఎగురవేశారు. సింగరేణి ప్రాంతమైన కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు ఏరియాల్లో బొగ్గు బావుల వద్ద సీపీఐ, సీపీఎం, ఏఐటీయూసీ, సీఐటీయూ, ఇఫ్టూ, న్యూడెమోక్రసీ తదితర యూనియన్ నాయకులు పెద్ద ఎత్తున మేడే ఉత్సవాలను నిర్వహించారు. పాల్వంచ, భద్రాచలం ఐటీసీ బీపీఎల్, మణుగూరు హైవీ వాటర్ ప్రాజెక్టు తదితర కర్మాగారాల వద్ద కార్మికుల సంఘాల ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలను నిర్వహించారు. కొత్తగూడెం బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ ఆల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల రాంచందర్ ఆధ్వర్యంలో జెండాను ఎగురవేశారు. తాపీ వర్కర్స్, ఆటో యూనియన్ వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహించారు. కొత్తగూడెం నియోజకవర్గం భద్రాచలం, ఇల్లెందు, పినపాక, అశ్వారావుపేటలో మేడే ఉత్సవాలను నిర్వహించారు.

## అథ్లెటిక్స్‌కు వరం

(5వ పేజీ తరువాయి)

శంకుస్థాపన సైతం చేశారు. అయితే 6 వరుసల ట్రాక్ నిర్మాణంపై అథ్లెట్లు, సీనియర్ క్రీడాకారులు, క్రీడా నిపుణులు పెదవి విరిచారు. రాష్ట్ర, జాతీయ పోటీలు నిర్వహిస్తే ఫైనల్స్ విభాగం పోటీ నిర్వహించాలంటే ఖచ్చితంగా 8 వరుసల ట్రాక్ ఉండాలని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలని అధికారులను వేడుకున్నారు. ఒకే సారిగా 8 వరుసల ట్రాక్ నిర్మించాలని సూచించారు. దీంతో స్పందించిన నాటి కలెక్టర్ గౌతమ్ 8 వరసల ట్రాక్ నిర్మాణానికి ఓకే చెప్పారు. అనంతరం కాంట్రాక్టు వ్యవహారాలు, ఎన్నికల కోడ్‌తో పనులు ప్రారంభం కాలేదు. తాజాగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 8 వరుసల ట్రాక్ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో పాటు త్వరగా నిర్మించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో దశాబ్ద కాలం నాటి క్రీడాకారుల కోరిక నెరవేరబోతోంది.

### క్రీడా వేదికగా ఖమ్మం

జిల్లాలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు మంత్రి తుమ్మల ప్రత్యేక చొరవ చూపిస్తున్నారు. సర్దార్ పటేల్ స్టేడియంలో క్రీడాకారులకు కావాల్సిన అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రధానంగా నగరానికి నడిబొడ్డున ఉన్న ఎస్పీ స్టేడియం జాతీయ, అంతర్జాతీయ క్రీడల వేదిక కావాలనేదే ఆయన కోరిక. అందుకోసం ఎంత ఖర్చయినా స్టేడియంలో అత్యాధునిక హంగులతో క్రీడాకారులకు అన్ని సదుపాయాలను సమకూర్చేందుకు ప్రత్యేక ప్రణాళికలు రచిస్తున్నారు.

### టేబుల్ టెన్నిస్ ఇండోర్ హాల్

ఎస్పీ స్టేడియంలో శుక్రవారం సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ పనులతో పాటు రూ.50లక్షలతో నూతనంగా టేబుల్ టెన్నిస్ ఇండోర్‌హాల్ నిర్మాణానికి సైతం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేయనున్నారు. ఈ హాలులో సుమారు 6 టీటీ టేబుల్స్ ఏర్పాటు చేసేలా నిర్మాణం చేపటనున్నారు.

**మెరికల్లాంటి అథ్లెట్లు తయారవుతారు: సునిల్‌రెడ్డి, డీవైఎస్‌వో**

ఎస్పీ స్టేడియంలో సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ నిర్మాణంతో మెరికల్లాంటి క్రీడాకారులు తయారవుతారు. సింథటిక్ ట్రాక్ ఒక విధంగా స్టేడియానికి మణిహారంగా నిలవడంతో పాటు అథ్లెటిక్స్ క్రీడాకారులకు వరం లాంటిది. స్టేడియంలో అన్ని క్రీడా వసతులు అందుబాటులోకి వస్తున్నాయి. ఇక సత్తా చాటాల్సింది క్రీడాకారులే. జిల్లా వ్యాప్తంగా మరింతగా క్రీడా వసతుల కల్పించేందుకు కృషి చేస్తున్నాం. స్టేడియంలో సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి సహకరించిన మంత్రి తుమ్మలకు క్రీడాకారుల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు.

## కొనలేం.. దాచలేం

(5వ పేజీ తరువాయి)

సీఎంఆర్ కింద క్వింటా ధాన్యానికి 67 కేజీలు బియ్యం ఇవ్వాల్సి ఉండగా యాసింగిలో క్వింటాకు 55 కేజీల బియ్యం మాత్రమే వస్తోందని కొందరు మిల్లర్లు చెబుతున్నారు. ప్రభుత్వానికి బియ్యం ఇచ్చేటప్పుడు తాము నష్టపోతున్నామని పేర్కొంటున్నారు. ప్రభుత్వ ధాన్యం తీసుకొవడానికి మిల్లర్లు ఉత్సాహం చూపకపోవడానికి ఇది కూడా ఒక కారణంగా ఉంది. మరోవైపు ఇదే మిల్లర్లు సొంత వ్యాపారం కోసం ప్రైవేటుగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు.

### కొనుగోలు కేంద్రాల్లో కొర్రీలు..

ప్రభుత్వం సన్నధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా కొనుగోళ్ల సమయంలో అనేక కొర్రీలు పెడుతుండడంతో రైతులు ప్రైవేటుగానే తమ ధాన్యం విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం దొడ్డు రకాలు క్వింటాకు రూ.2,300, సన్న రకానికి రూ.2,320కు కొనుగోలు చేస్తోంది. సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తోంది. అయితే కొనుగోలు కేంద్రాల్లో సవాలక్ష నిబంధనలున్నాయి. ధాన్యంలో తేమ 17శాతం లోపే ఉండాలని, దుమ్ము, ధూళి లేకుండా తూర్పారా పట్టాలని సూచిస్తున్నారు. దాంతో చాలామంది రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకెళ్లడం లేదు. మరోవైపు మిల్లర్లు పచ్చి ధాన్యాన్నే క్వింటాకు రూ.1,800నుంచి రూ.2వేలకు కొనుగోలు చేస్తుండడంతో తూకం కలిసి వస్తుందని అనేకమంది రైతులు తమ ధాన్యాన్ని మిల్లర్లకు నేరుగా అమ్ముతున్నారు. కొన్నిచోట్ల మిల్లర్లు స్థానిక రైతులతో ఒప్పందం చేసుకుని సన్నరకం ధాన్యం కొనుగోలు చేసి ప్రభుత్వ బోనస్ రైతులకు వెళ్లేలా లోపాయికారి ఒప్పందాలు చేసుకుంటున్నారు.

మరో వైపు ధాన్యం ఒకేసారి వస్తుండడంతో కొనుగోలు కేంద్రాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లాలో ఇప్పటికే 30 లక్షల కొందరు రైతులు ధాన్యం తెస్తామని గన్నీబ్యాగులు తీసుకెళ్లి ధాన్యం తేవడంలేదు. దీంతో కల్లాల్లో గన్నీబ్యాగుల కొరత తీవ్రంగా ఉంది. ఇటీవల అకాల వర్షాలు వస్తుండడంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఆరబోసిన రైతులు భయపడుతున్నారు. ధాన్యం కొనుగోళ్లపై మంత్రులు సమీక్షలు నిర్వహిస్తున్నా.. క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోళ్లు ఆశించిన స్థాయిలో జరగడం లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లపై దృష్టి పెట్టి అవసరమైతే అదనపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## గిరిజన వికలాంగురాలి ఆశలు గల్లంతు

- నెరవేరని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్కల హామీ
- ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో కనిపించని కైలాసబాయి పేరు
- బోరుమంటున్న బాధితురాలు



నాడు పాదయాత్రలో కైలాసబాయితో రేవంత్‌రెడ్డి, సీతక్క(ఫైల్ ఫొటో)

ఇల్లెందు, మే 1 (ఆంధ్రజ్యోతి): ఆమె ఒక నిరుపేద గిరిజన వికలాంగురాలు... డిగ్రీ చదివి టైలరింగ్ వృత్తితో పొట్టనింపుకుంటోంది.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు నేటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క ఇల్లెందులో కాంగ్రెస్ పాదయాత్రకు రాగా, తనకు గూడు కల్పించాలని ఆమె వేడుకుంది. ఇందిరమ్మ ప్రభుత్వం రాగానే ఇల్లు, ఉపాధి కల్పిస్తామని ఆనాడు వారు హామీ ఇచ్చారు. అయితే వారు ఇచ్చిన హామీని ఇందిరమ్మ కమిటీ సభ్యులు తుంగలో తొక్కారు..తొలి జాబితాలో ఎంపికైనప్పటికీ మలి జాబితాలో ఆమె పేరు తొలగించారు. తనకు న్యాయం చేయాలని ఇల్లెందుకు చెందిన ధరావత్ కైలాసబాయి అనే ఒంటరి మహిళ వేడుకుంటోంది. పట్టణంలోని బాటమ్‌ఫిట్ బస్తీకి చెందిన కైలాసబాయికి సింగరేణి జేకే-5 ఓసీ నిర్వాసితురాలిగా ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఇంటి స్థలన్ని కేటాయించారు. పేదరికం మూలంగా ఆ స్థలంలో సిమెంట్ రేకుల, పాలిథిన్ కవర్లతో చిన్న నివాసాన్ని ఏర్పాటు చేసుకుంది. కొద్ది కాలంగా నివాసానికి అనువుగా లేకపోవడంతో సమీపంలోని తన సోదరుడి గృహంలో తలదాచుకుంటూ టైలరింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తోంది. డబుల్ బెడ్ రూం ఇంటికోసం గత పాలకుల చుట్టూర ప్రదిక్షణలు చేసినా ఆమె గోడు ఎవ్వరూ వినిపించుకోలేదు. నాడు పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి, సీతక్క కాంగ్రెస్ రాష్ట్ర పాదయాత్రలో బాగంగా ఇల్లెందు వచ్చినప్పుడు ఆమె స్వయంగా కలిసి తన గోడు చెప్పుకుంది. రేవంత్ రెడ్డి, సీతక్క ఆమె గోడు విని ఆమె మెడలో పూలదండవేసి ఇందిరమ్మ ప్రభుత్వం వస్తుందని నీకు ఇల్లు, ఉపాధి కలిపిస్తామని స్వయంగా భరోసాను ఇచ్చారు. అదే ఆశతో ఉన్న ఆమె ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడగానే హైదరాబాద్ ప్రజాభవన్‌కు వెళ్లి తన దుస్థితిపై విజ్ఞాపన పత్రం సమర్పించింది. ఏడాది కాలంగా ఇందిరమ్మ ఇంటి కోసం కళ్లలో ఒత్తులేసుకుని ఎదురుచూస్తోంది. కాలనీలో సొంత ఇంటిస్థలం కూడా ఉండటంతో ఇక తనకు ఇందిరమ్మ ఇల్లు వస్తుందన్న ఆశతో ఉన్న కైలాసబాయి ఆశలకు ఇందిరమ్మ కమిటీ గండికొట్టింది.



శిథిలమైన ఇంటి ముందు కైలాసబాయి

### జాబితాలో పేరు గల్లంతు..

పట్టణంలోని 13వ వార్డులో నివసిస్తున్న కైలాసబాయి పేరు ఇందిరమ్మ ఇండ్ల అర్హుల మొదటి జాబితాలో మొదటి పేరుగా నమోదు అయింది. జాబితాలో తనపేరే మొదటి స్థానంలో ఉండటంతో ఇందిరమ్మ ఇల్లు వస్తుందని ఆశించిన ఆమెకు తుది జాబితా నిరాశే మిగిల్చింది. నిజమైన లబ్ధిదారుల ఎంపికకు నియమించిన ఇందిరమ్మ కమిటీ సభ్యులు 29 మంది జాబితా రూపొందించి మున్సిపల్ కమిషనర్‌కు సమర్పించగా ఆమె పేరు అందులో లేదు. తన పేరు ఎందుకు తొలగించారంటూ కమిటీ సభ్యులను అడిగినా ఆమె గోడు పట్టించుకునే నాధుడే కరువయ్యారు.

ఇందిరమ్మ ఇంటికోసం డబ్బులు ఇవ్వలేనని చెప్పడం వల్లనే తన పేరు జాబితా నుంచి తొలగించారని వాపోయింది. న్యాయం చేయాలని ఎమ్మెల్యే కనకయ్యను వేడుకుంటోంది.

# పెద్దవాగు ప్రాజెక్టుకు మహర్దశ

- 82 శాతం వాటా చెల్లించనున్న ఏపీ
- తెలంగాణ ప్రతిపాదనలకు ఏపీ ప్రభుత్వం సానుకూలం

అశ్వారావుపేట, మే 1(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం, పెదవాగు మధ్యతరహా ప్రాజెక్టు తెలంగాణ ఏర్పడిన తరువాత తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. ఫలితంగా గత ఏడాది జూన్‌లో వచ్చిన వర్షాలకు పెదవాగు ప్రాజెక్టు కట్టకు గండి పడింది. వేలాది ఎకరాల పంట పొలాలు నీట మునిగి పోయాయి. ప్రాజెక్టు తెలంగాణలో ఉండటం, ఆయకట్టు ప్రాంతం అధికశాతం ఏపీలో ఉండటంతో అప్పటి ప్రభుత్వం పెదవాగు ప్రాజెక్టు మరమ్మతులను పట్టించుకోలేదు. అంతరాష్ట్ర సమస్యతో ఏపీ, తెలంగాణ ఒకరిపై ఒకరు బాధ్యత వేసుకొని ప్రాజెక్టు మరమ్మతులను నిర్లక్ష్యం చేశారు. అంతరాష్ట్ర సమస్యగా మారిన పెదవాగు ప్రాజెక్టు మరమ్మతులకు ఏపీ ప్రభుత్వం వాటాను చెల్లించాలని తెలంగాణ ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు చేసిన విన్నపానికి ఆంధ్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో ప్రాజెక్టు మరమ్మతులకు మార్గం సుగమం అయ్యింది. ప్రాజెక్టుకు మహర్ధశ వచ్చినట్లయ్యింది. ఇది ఏపీ, తెలంగాణాలోని ప్రాజెక్టు ఆయకట్టుదారుల్లో ఆనందాన్ని నింపనుంది.

### 2014 నుంచి మరమ్మతులకు నోచుకోని వైనం

తెలంగాణాలోని అశ్వారావుపేట మండలం, గుమ్మడపల్లి వద్ద నిర్మించబడి వున్న పెదవాగు మధ్యతరహా ప్రాజెక్టు 16వేల ఎకరాల ఆయుకట్టుకు నీరందించేలా నిర్మించబడింది. తెలంగాణా రాష్ట్రం ఏర్పాటుతో ప్రాజెక్టు శిఖ భాగం, 2,360 ఎకరాలు తెలంగాణ రాష్ట్రంలో ఉంది. 2వేల ఎకరాలు పోలవరం ముంపులో పోయింది. మిగతా 13,640 ఆయకట్టు కలిగిన వేలేరుపాడు, కుకునూరు మండలాలు ఆంధ్ర ప్రదేశ్‌లోకి వెళ్లిపోయింది. ఆయకట్టు ఏపీలో, ప్రాజెక్టు తెలంగాణాలో ఉండటంతో తెలంగాణ ఏర్పడిన 2014 నుంచి ఈ ప్రాజెక్టు మరమ్మత్తులకు నోచుకోలేదు. ఇరు ప్రభుత్వాలు పట్టించుకోలేదు. దీంతో గత ఏడాది జూన్‌లో వచ్చిన వర్షాలకు ఈ ప్రాజెక్టుకు భారీ గండి పడింది. ప్రాజెక్టు గండిని అప్పట్లోనే తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, నీటిపారుదల శాఖ రాష్ట్ర స్థాయి అధికారులు ప్రాజెక్టు గండిని సందర్శించారు. ప్రాజెక్టు పునర్మిణానికి ఏపీ ప్రభుత్వ సహకారం అవసరమని తెలంగాణా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణా ప్రభుత్వం నుంచి ఏపీ ప్రభుత్వానికి వారి వాటా నిధుల కోసం లేఖ రాశారు. అనేక మార్లు అక్కడి ప్రభుత్వంతో సంప్రదింపులు జరపడమే కాకుండా ఏపీ అడిగిన ప్రతిపాదనలను తెలంగాణా ప్రభుత్వం పంపింది. ఇటీవల జరిగిన గోదావరి బోర్డు సమావేశంలో కూడా ప్రాజెక్టును ఇరు ప్రభుత్వాలు తామాషా ప్రకారం భరించి పునరిర్మాణం చేయాలని సూచించారు. ఇటీవల ఆ ప్రాంతానికి చెందిన పలువురు రైతులు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మలను కలసి ప్రాజెక్టుకు నిధుల మంజూరి చేయించాలని కోరారు.



అశ్వారావుపేట మండలంలోని పెదవాగు మధ్యతరహా ప్రాజెక్టు

కొద్దిరోజుల్లోనే ప్రాజెక్టు మరమ్మతుల కోసం అన్నిరకాల అనుమతులు ఏపీ ప్రభుత్వం నుంచి వస్తాయని చెబుతున్నారు. ఈ అంచనాలలో గండి పూడ్చడం, కట్టపై ఏర్పడిన గండ్లను పూడ్చడం, హెడ్ స్లూయిస్, స్పిల్‌వే, ఇతర అత్యవసర మరమ్మత్తులకు ఈ నిధులు ఉపయోగించనున్నట్లు అంచనాల్లో పేర్కొన్నారు. ఏపీ నుంచి నిధులు విడుదలైన వెంటనే తెలంగాణ ప్రభుత్వం ప్రాజెక్టు పటిష్ఠతకు, మరిన్ని గేట్లు పెంచడానికి, ఇతర అవసరాల కోసం మరో నాలుగైదు కోట్లు కేటాయించే అవకాశం ఉన్నట్టు చెబుతున్నారు. ఏపీ ప్రభుత్వం 82శాతం వాటాను భరించేందుకు సానుకూలత వ్యక్తం చేయడమే కాకుండా కొన్ని రోజుల్లోనే నిధులు విడుదల చేసేందుకు సిద్ధం అవ్వడంతో రైతుల్లో హర్షం వ్యక్తం అవుతుంది.

అశ్వారావుపేట ఐబీ డీఈఈ కృష్ణను వివరణ కోరగా ఏపీ ప్రభుత్వం ఆయకట్టు ఆధారంగా 82 శాతం నిధులు ఇచ్చేందుకు సానుకూలత వ్యక్తం చేసిందని, ఇప్పటికే తెలంగాణ అధికారులకు సమాచారం అందిందన్నారు. కొద్ది రోజుల్లోనే ప్రాజెక్టు పనులకు శ్రీకారం చుట్టే అవకాశం ఉందని తెలిపారు.

### రూ.19.20 కోట్లతో అంచనా

ఆంధ్రప్రభుత్వం పెదవాగు ప్రాజెక్టు మరమ్మతులకోసం తన వాటాగా అంచనాలలో 82శాతం నిధులు చెల్లించేందుకు సిద్ధమైంది. మరమ్మతుల కోసం మొత్తం 19.20కోట్లకు అంచనా వేయగా, అందులో 82 శాతం అంటే రూ.15.74కోట్లు ఏపీ ప్రభుత్వం చెల్లించేందుకు లాంచనంగా అంగీకరించినట్టు నీటి పారుదల శాఖాధికారులు తెలిపారు. మిగతా 18శాతం నిధులను తెలంగాణ ప్రభుత్వం భరిస్తుంది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలను ఏపీ ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ కార్యాలయం, విజయవాడ ఈ ప్రతిపాదనలను ఆమోదిస్తూ పరిపాలన మం జూరు కోసం ఏపీ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కార్యాలయానికి అనుమతులకోసం లేఖను పంపారు.

# శ్రామికవర్గాన్ని రక్షించేది ఎర్రజెండానే

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

కొత్తగూడెం, మే 1 (ఆంధ్రజ్యోతి): సామ్రాజ్యవాద శక్తుల చేతిలో మగ్గుతున్న శ్రామికవర్గాన్ని రక్షించేది ఎర్రజెండానేనని, ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే ఏకైక పండుగ మేడే అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సీపీఐ, అనుబంధ ప్రజాసంఘాలు, ఏఐటీయూసీ అనుబంధ కార్మికసంఘాల ఆధ్వర్యంలో గురువారం నియోకవర్గ వ్యాప్తంగా 283 కేంద్రాల్లో మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే ఏకైక పండుగ మేడే అన్నారు. ఈ కార్యక్రమాల్లో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌.క. సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గసభ్యులు దుగ్గిరాశి వెంకటేశ్వర్లు, చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, జిల్లాసితి సభ్యులు వాసిరెడ్డి మురళి, నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

### మేడే స్ఫూర్తితో పోరాటాలు

కొత్తగూడెం, మే 1 (ఆంధ్రజ్యోతి) : మేడే స్ఫూర్తితో కార్మిక, కర్షక ఐక్యపోరాటాలు నిర్వహిస్తూ పన్నెండు గంటల పని విధానం రద్దుకై మరో చికాగో పోరాటానికి కార్మికవర్గం సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మేడే సందర్భంగా కొత్తగూడెంలో మేడే కార్యక్రమాల్లో పాల్గొని జెండా ఆవిష్కరణ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గసభ్యులు లిక్కి బాలరాజు, రాష్ట్ర కమిటీ సభ్యుల అన్నవరపు కనకయ్య, అన్నవరపు సత్యనారాయణ, రేపాకుల శ్రీనివాస్, నాయకులు కే. సమ్మయ్య, సందకూరి లక్ష్మి, నందిపాటి రమేష్, ఇందిరా వాణి సక్రం, విజయలక్ష్మి, రాములు పాల్గొన్నారు.

# 'నీట్' పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, మే 1(ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం మే 4న జరిగే నీట్ యూజీ ప్రవేశ పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు సకాలంలో చేరుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం ఆయన కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి నీట్ యూజీ ప్రవేశ పరీక్ష నిర్వహణపై అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లా పరిధిలో మే 4న మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు జరిగే నీట్ యూజీ ప్రవేశ పరీక్ష రాసే 2,739 మంది విద్యార్థుల కోసం 6 పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. కేంద్రాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల వసతులు కల్పించాలని సూచించారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, నీట్ పరీక్ష జిల్లా నోడల్ అధికారి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### పరీక్షా కేంద్రాల వద్ద ఆంక్షలు : సీపీ

ఖమ్మం క్రైం మే 1 (ఆంధ్రజ్యోతి): ఈనెల 4న ఖమ్మం కమిషనరేట్ పరిధిలో నిర్వహించే నీట్ (యూజీ)-2025 పరీక్షల సందర్భంగా ఆయా పరీక్షాకేంద్రాల వద్ద 163బీఎన్ఎస్ఎస్ సెక్షన్ అమల్లో ఉంటుందని సీపీసునిల్‌దత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12గంటలనుంచి రాత్రి 8గంటల వరకు ఈ సెక్షన్ అమల్లో ఉంటుందని పరీక్షలు జరిగే సమయంలో ఆయాపరీక్ష కేంద్రాల్లో 200మీటర్ల వరకు 5గురు మించి ఉండవద్దన్నారు.

# వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభం



చిన్నారులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

ఖమ్మం స్పోర్ట్స్, మే 1(ఆంధ్రజ్యోతి): డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో గురువారం వేసవి శిక్షణా శిబిరాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన వివిధ క్రీడాంశాలలో సుమారు 800 మంది విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఇదిలా ఉండగా జిల్లా వ్యాప్తంగా క్రీడా శిబిరాలను నగరంలో 22, ఇతర గ్రామీణ ప్రాంతాలలో 23 మొత్తం 45 శిబిరాలను జిల్లా క్రీడల శాఖ ఏర్పాటు చేసింది. కాగా శిబిరాలలో పాల్గొనే విద్యార్థులకు క్రీడా పరికరాలను, కిట్లను శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అందించనున్నారు. జిల్లాలో ఈ నెల 31 వరకు జరగనున్న ఈ వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు సాఫీగా జరిగేందుకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నారు. కాగా గురువారం వీవీ పాలెం గ్రామంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఫుట్‌బాల్ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు.

# డీఈవోగా సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ



సత్యనారాయణను సన్మానిస్తున్న కార్యాలయ ఉద్యోగులు

ఖమ్మం ఖానాపురం హవేలీ, మే 1(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా విద్యాశాఖ అధికారిగా గురువారం సామినేని. సత్యనారాయణ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆయనను డీఈవోగా నియమిస్తూ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ మదన్‌మోహన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యాశాఖ అధికారిగా ఉన్న సోమశేఖ శర్మ బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఖమ్మం డైట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న సత్యనారాయణను పూర్తి అదనపు బాధ్యతలతో జిల్లా విద్యాశాఖ అధికారిగా నియమించారు. ఆయన గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆయనను డీఈవో కార్యాలయ సిబ్బంది, పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాగా నూతనంగా నియమితులైన సత్యనారాయణ ఈ ఏడాది జూలైలో ఉద్యోగ విరమణ చేయనున్నారు. కేవలం మూడు నెలలు మాత్రమే జిల్లా విద్యాశాఖ అధికారిగా సేవలు అందించనున్నారు.

# నేడు న్యాయవాద సంక్షేమ సంఘం ఎన్నికలు

ఖమ్మం లీగల్, మే 1 (ఆంధ్రజ్యోతి): న్యాయవాద సంక్షేమసంఘ నాలుగు డైరెక్టర్ పదవుల కోసం నేడు శుక్రవారం ఎన్నిక జరగనున్నది. ఆరుగురు అభ్యర్థులు ఎన్నడులేని విధంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రతి ఓటర్‌ని స్వయంగా కలిసి తనకు ప్రాధాన్యత ఓటువేయమని ప్రార్థిస్తున్నారు. ప్రతి ఓటరుకి నాలుగు ప్రాధాన్యత ఓట్లు ఉంటాయి. వాటిని ప్రాధాన్యత క్రమంలో ఓటును సద్వినియోగం చేసుకుంటారు. పోలైన ఓట్లను ప్రాధాన్యత క్రమంలో లెక్కించి ఫలితాలను ప్రకటిస్తారు. ఇప్పటికే 8మంది డైరెక్టర్లు ఉండగా మరో నాలుగు డైరెక్టర్ పదవులకి ఎన్నిక జరగనున్నడంతో ప్రస్తుతం ఉన్న డైరెక్టర్ దేవకి శ్రీనివాసరావు గుప్తా, అధ్యక్ష పదవి కైవసం చేసుకోవడం కోసం తీవ్రంగా కృషిచేస్తున్నారు. ప్రస్తుతం పోటీలో ఉన్న మరో డైరెక్టర్ అభ్యర్థి కూడా అధ్యక్షపదవి రేసులో ఉన్నాడు. ప్రస్తుతం ఉన్నవారిని తమకు అనుకూలంగా పోటీలో ఉన్న అభ్యర్తులను గెలిపించుకోవడం కోసం తీవ్రంగా కృషిచేస్తున్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు ఆవుల అనురాధ, వల్లపు లింగయ్య, షేక్ నస్రీన్, కొలకపూరి ప్రసాద్, కాసర రాజశేఖర్‌రెడ్డి, పాలవెల్లి వెంకటేశ్వర్లు పోటీలో ఉన్న అభ్యర్థులు తమకు కేటాయించిన గుర్తులతో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. తమను గిలిపిస్తే సొసైటీ అభివృద్ధికి కృషిచేస్తామని హామీలు గుప్పిస్తున్నారు.

ఎన్నికల రోజు ప్రతి ఓటరు తమవెంట గుర్తింపు కార్డు తెచ్చుకోవాలని ఎన్నికల అధికారులు తెలిపారు. ఉదయం 10గంటల నుంచి 3గంటల వరకు ఓటింగ్ నిర్వహించి, సాయంత్రం 4గంటలకు ఓట్ల లెక్కింపు పూర్తిచేసి విజేతలను ప్రకటిస్తామని తెలిపారు. తరువాత నూతన కమిటీ ఎన్నిక జరుగుతుందని, ఎన్నికలకు సంబంధించిన పూర్తి ఏర్పాట్లు చేసినట్లుగా ఎన్నికల అధికారి గుడ్డేటి రమేష్ తెలిపారు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

మధిరరూరల్, మే1(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని రొంపిళ్లలో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శీలం మల్లిఖార్జునరెడ్డి (33) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తన ఇంటిలో కూలర్ ఆన్ చేసేందుకు ప్లగ్ పెడుతుండగా విద్యుదాఘాతం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ఇంకా పెళ్లి కాలేదు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు ఎస్ఐ లక్ష్మీ భార్గవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చెల్లని చెక్కు కేసులో 6 నెలల జైలు

ఖమ్మం లీగల్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరం శాంతినగర్‌కు చెందిన దొడ్డా రామారావుకి చెల్లని చెక్కు కేసులో 6 నెలలు జైలుశిక్షతో పాటు ఫిర్యాదికి రూ.9లక్షలు నష్టపరిహారం చెల్లించాలని ఖమ్మం మొదటి అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి బెక్కం రజని గురువారం తీర్పు చెప్పారు. ఖమ్మం నగరంలోని బుర్హాన్‌పురం ప్రాంతానికి చెందిన బొందిలి కెసర సింగ్ వద్ద అవసరాల నిమిత్తం 2020లో రామారావు రూ.9లక్షలు అప్పుగా తీసుకొని నోటు రాసి ఇచ్చాడు. రుణం తిరిగి ఇవ్వమని అడగగా 2021లో రూ.9లక్షలకు చెక్కు ఇచ్చాడు. బ్యాంకులో సరిపడ నగదు లేకపోవడంతో చెక్కు తిరస్కరణకు గురైంది. ఫిర్యాది తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీసు జారీచేసి కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేశాడు. కేసును విచారించిన న్యాయాధికారి నేరం రుజువుకావడంతో శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు.

## అత్తలపై కోడలి దాడి

అశ్వాపురం, మే1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొందిగూడెం గ్రామంలో అత్తలపై కోడలు దాడిచేసిన సంఘటనకు సంబంధించి గురువారం అశ్వాపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గొందిగూడెం గ్రామానికి చెందిన వాసం నవీనా గురువారం తన అత్త ఈశ్వరితో ఘర్షణపడింది. అత్తను దుర్భాషలాడటమే కాక, పొయ్యిలో ఉన్న నిప్పుకట్టెతో కాల్చింది. దీంతో ఈశ్వరి కేకలు వేయగా పక్కింట్లో ఉంటున్న ఆమె అక్క ఊర్మిళ వచ్చి నవీనాను మందలించింది. ఆమెను కూడా దుర్భాషలాడుతూ పొయ్యిమీద ఉన్న వేడినీళ్లను ఊర్మిళపై పోసింది. దీంతో ఆమె శరీరంపై పలు గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం మణుగూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈశ్వరి ఫిర్యాదు మేరకు అశ్వాపురం పోలీసులు నవీనాను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

## అట్రాసిటీ కేసు నమోదు

అశ్వాపురం మే 1(ఆంధ్రజ్యోతి): అశ్వాపురం శివారు చవిటిగూడేనికి చెందిన రాయల సతీష్‌పై గురువారం అశ్వాపురం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ ఎస్టీ కేసు నమోదయ్యింది. వివరాల ప్రకారం.. అశ్వాపురం కాలువబజారుకు చెందిన రాయపూడి రాజేష్‌ను సతీష్ కులంపేరుతో దూషించాడన్న ఫిర్యాదు మేరకు మణుగూరు డీఎస్పీ వంగా రవీందర్‌రెడ్డి, అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డిలు గురువారం విచారణ నిర్వహించారు. ఫిర్యాదారుడిని విచారించారు. వివరాలను సేకరించి సాక్ష్యులను విచారించారు.

## పోలీసుల అదుపులో అక్రమ వసూళ్ల ముఠా

వైరా, మే 1 (ఆంధ్రజ్యోతి): అంతర్రాష్ట చెక్‌పోస్టు వద్ద ఓ హోంగార్డు ప్రోత్సాహంతో వాహనచోదకుల గురించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న నలుగురు ముఠా సభ్యులను వైరా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఖమ్మం జిల్లా వైరా మండలంలోని గన్నవరం-దాచాపురం వద్ద ఏపీ సరిహద్దుల్లోని అంతర్రాష్టి చెక్‌పోస్టు వద్ద విధి నిర్వహణలో ఒక హోంగార్డు తమ గ్రామానికి చెందిన ప్రైవేట్ వ్యక్తులను ప్రోత్సహించి వాహనదారుల నుంచి అక్రమంగా డబ్బులు వసూళ్లు చేస్తున్న వ్యవహారం వెలుగు చూసింది. ఏపీ నుంచి తెలంగాణలోకి రబీకి చెందిన ధాన్యం లారీలు రాకుండా నిలువరించేందుకు అధికారులు చెక్‌పోస్టును ఏర్పాటుచేశారు. అయితే ఇక్కడ విధి నిర్వహణలో హోంగార్డు నలుగురు ప్రైవేట్ వ్యక్తులను పెట్టుకొని, ఆచెక్‌పోస్టు గుండా రాకపోకలు సాగించే వాహనదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. అయితే కొంతమంది వాహనదారులు తమ వాహనాలు ఆపకుండా వెళ్తుండటంతో ప్రైవేట్ వ్యక్తులు వారిని దూషించారు. దాంతో ఆగ్రహించిన వాహనదారులు వారితో ఘర్షణ పడి వెంటనే వైరా పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే చెక్‌పోస్టు వద్దకు చేరుకున్న పోలీసులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

# వైద్యం వికటించి యువతి మృతి



జ్యోత్స్న(ఫైల్)

సత్తుపల్లి, మే1 (ఆంధ్రజ్యోతి): వైద్యం వికటించి యువతి మృతి చెందిన సంఘటన సత్తుపల్లిలో జరిగింది. అత్యవసరంగా ఆపరేషన్ చేయాలని డబ్బులు కట్టించుకుని ఆపరేషన్ అనంతరం యువతి మృతిచెందిందని కుటుంబ సభ్యులకు తాపీగా వైద్యులు సమాచారం తెలిపారు. ఆపరేషన్ వికటించడంతో వివాహిత మృతిచెందిందని మృతురాలి బంధువులు సత్తుపల్లిలో గురువారం ఆందోళన చేశారు. ఈ సంఘటనకు సంబంధించి బంధువుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా చింతలపూడి సమీపంలోని కోటపాడు గ్రామానికి చెందిన టీ.జ్యోత్స్న(24) అనారోగ్యానికి గురైంది. బుధవారం చింతలపూడిలో వైద్య పరీక్షలు చేయించుకోగా గర్భసంచి వద్ద సమస్య ఉందని, స్కానింగ్ తీయించుకోవాలని వైద్యులు సూచించారు. దీంతో బుధవారం సాయంత్రం సత్తుపల్లిలోని ఒక స్కానింగ్ సెంటర్‌లో స్కానింగ్ తీయించుకున్నారు. స్కానింగ్ అనంతరం రిపోర్ట్ చూసిన స్కానింగ్ సెంటర్ యజమాని తక్షణమే ఆపరేషన్ చేయాలని ఎదురుగా ఉన్న ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకోవాలని చెబుతూ హడావుడి చేశారని బాధితులు తెలిపారు. ఆయన సూచన మేరకు స్కానింగ్ సెంటర్ ఎదురుగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రిలో వివాహితను చేర్పించారు. ఆపరేషన్‌కు రూ.40వేలు ఖర్చు అవుతుందని చెప్పి, మొత్తం డబ్బులు కట్టించుకున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆపరేషన్ సందర్భంగా రక్తం అవసరం అవుతుందని చెప్పి తమతో బ్లడ్ ప్యాకెట్లు కూడా తెప్పించారని అన్నారు. ఆపరేషన్ విజయవంతం అయ్యిందని చెప్పిన వైద్యుడు, గురువారం ఉదయం వరకు జనరల్ వార్డులోనే ఉంచారని, ఆ తరువాత పరిస్థితి విషమించడంతో ప్రత్యేక గదిలోకి తరలించారని, కొద్దిసేపటి తర్వాత ఆమె మృతి చెందినట్లు చెప్పారని బంధువులు ఆరోపించారు.

జ్యోత్స్న చనిపోయిన తర్వాత ఆమె బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో ఆమె భర్త సహా కుటుంబ సభ్యులు ఎవరినీ మృతదేహం ఉన్న గదిలోకి వెళ్లకుండా గడియ పెట్టారు.

వివాహిత మృతిచెందిదనే విషయం తెలుసుకున్న స్కానింగ్ సెంటర్ యజమాని అక్కడి నుంచి వెళ్లిపోయారని మృతురాలి బంధువులు ఆరోపించారు. గంటల తరబడి ఆందోళన జరుగుతుండటంతో స్కానింగ్ సెంటర్ యజమాని వేరేచోట తలదాచుకున్నట్లు తెలిసింది. మహిళ మృతిచెందిన సంఘటనకు సంబంధించి సెటిల్‌మెంట్ పేరుతో కొందరు రంగంలోకి దిగారు. ఇరువర్గాల పెద్ద మనుషుల చర్చలు జరుగుతుండటంతో గంటల తరబడి పోలీసులు కూడా ప్రేక్షకపాత్ర వహించాల్సిన పాత్ర ఎదురైంది. మొత్తం సంఘటనపై అధికారులు ఎవరూ నిర్ధారించలేదు.



ఆందోళనకారులతో మాట్లాడుతున్న పోలీసులు

## ఐదుగురు నిందితులకు జీవిత ఖైదు

కొత్తగూడెం లీగల్, మే 1 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ ఐదుగురికి జీవిత ఖైదు విధిస్తూ గురువారం తీర్పు చెప్పారు. దుమ్ముగూడెం మండలం లచ్చగూడేనికి చెందిన కారం తులసీ తన భర్త రామకృష్ణకి అదే గ్రామానికి చెందిన సొందే ముద్దరాజు కుటుంబానికి భూమి విషయంలో తగాదాలు జరుగుతున్నాయి. గ్రామపెద్దల సమక్షంలోనే భూమి పంచాయతీ పరిష్కారం కాలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి పోలీసులు దుమ్ముగూడెం మండలం లచ్చగూడేనికి చెందిన సొందే రవిబాబు, సొందే ముద్దరాజు, పెనుబల్లి భద్రయ్య, సొందే అర్జున్ పొడియం నగేష్, పొడియం లచ్చు అలియాస్ లచ్చయ్య, పొడియం భద్రయ్య, చర్ల మండలం గుంపెన గూడేని చెందిన పాయం సతీష్‌లపై చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ అనంతరం సొందే రవిబాబు, పొడియం నగేష్, పొడియం లచ్చు అలియాస్ సొందే ముద్దరాజు, పాయం సతీష్‌లపై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు, రూ.4వేల జరిమానా విధిస్తూ తీరు చెప్పారు. సొందే అర్జున్‌పై నేరం రుజువు కాలేదని కోర్టు భావించి విడుదల చేశారు. ప్రాసిక్యూటర్ పీపీడి. లక్ష్మి వాదించారు. నోడల్ ఆఫీసర్ జి. ప్రవీణ్, లైజన్ ఆఫీసర్ ఎన్. వీరబాబు (కోర్టు డ్యూటీ ఆఫీసర్) పీసీ తిరుపతిలు సహకరించారు.

## వైరాలో ఆస్పత్రి సీజ్

వైరా, మే 1 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అర్హతలు లేకుండా నిర్వహిస్తున్న వైరాలోని ఓ ఆస్పత్రిని గురువారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులు సీజ్ చేశారు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఎంసీఐ) లేక రాష్ట్ర వైద్య కౌన్సిల్(ఎస్ఎంసీ)లో కూడా రిజిస్ట్రర్ అయిన సర్టిఫికెట్లు లేని హానూక్ సెంటర్‌ను గురువారం డీఎంహెచ్‌వో కళావతిబాయి సీజ్ చేశారు. నిర్వాహకుడిపై కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తనిఖీల్లో అధికారులు బిందుశ్రీ, సాంబశివరావు పాల్గొన్నారు.



హానూక్ ఐకేర్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో

## ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు వెళ్లిన అధికారుల అడ్డగింత



అధికారుల కారును అడ్డుకుంటున్న మహిళలు

తల్లాడ, మే1(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్లు అనర్హులకు మంజూరు చేసి, అర్హులైన పేదలకు అన్యాయం చేశారంటూ సర్వేకు వెళ్లిన అధికారుల కారును దళిత మహిళలు అడ్డుకున్నారు. ఈసంఘటన గురువారం తల్లాడ మండలం అన్నారుగూడెంలో జరిగింది. గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు 40మందికి మంజూరయ్యాయి. వీరిలో అనర్హులున్నారని మరో 18మంది అర్హులకు అన్యాయం జరిగిందని పేర్కొంటూ ఎమ్మెల్యే మట్టా రాగమయికి కొందరు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే ఆదేశాలతో గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేకు ఎంపీడీవో సురేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు కలిసి కారులో వెళ్లగా ఆకారును మహిళలు అడ్డుకున్నారు. ఈదశలో ఎంపీడీవో జోక్యం చేసుకుని సర్వే చేస్తేనే అర్హులెవరో, అనర్హులెవరో గుర్తించడం జరుగుతుందన్నారు. సర్వేకు సహకరించాలని చెప్పడంతో ఆందోళన విరమించారు.

# క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలి

- ఇంటర్మీడియట్ బోర్డు ప్రత్యేకాధికారి యాదగిరి

బోనకల్, మే 1 (ఆంధ్రజ్యోతి): విలువలు, క్రమశిక్షణతో కూడిన విద్యను విద్యార్థులకు అందించేలా అధ్యాపక సిబ్బంది కృషి చేయాలని ఇంటర్మీడియట్ బోర్డు ప్రత్యేకాధికారి సీహెచ్. యాదగిరి సూచించారు. ఇంటర్ బోర్డు డైరెక్టర్ శ్రీ కృష్ణ ఆదిత్య ఆదేశాల మేరకు ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను గురువారం ఆయన డీఐఈవో రవిబాబుతో కలిసి తనిఖీ చేశారు. ఈ నెలలో జరగనున్న సప్లిమెంటరీ పరీక్షలకు విద్యార్థులను ఏ విధంగా సన్నద్ధం చేస్తున్నారో అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ కళాశాలల పట్ల ప్రజల్లో నమ్మ కం కలిగించేలా పని చేయాలని కోరారు. అడ్మిషన్లను పెంచేలా చూడాలని ఆదేశించారు. కళాశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల ఫొటోలతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏవో సంజయ్, ప్రిన్సిపాల్ నళినిశ్రీ పాల్గొన్నారు.

## ఆరో బెటాలియన్ క్యాంపు పరిశీలన

కొత్తగూడెం, మే 1 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం మునిసిపాలిటీ పరిధిలో చాతకొండ ఆరవ బెటాలియన్‌ను గురువారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నూతనంగా శిక్షణ పొందిన ఎస్‌డీఆర్ఎఫ్ (స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్‌ఫోర్స్) 100మంది సభ్యులతో కూడిన బృందంతో మాట్లాడారు. బెటాలియన్ అభివృద్ధి పనుల గురించి బెటాలియన్ అసిస్టెంట్ కమాండర్ అబ్దుల్ రషీద్, బెటాలియన్ ఉన్నతాధికారులతో కలెక్టర్ చర్చించి పలు సూచనలు చేశారు.

## ఖేలో ఇండియా యూత్ అథ్లెటిక్స్ పోటీలకు వైశాలి



ఖమ్మం స్పోర్ట్స్ మే 1(ఆంధ్రజ్యోతి): బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో మే 12 నుంచి 14 వరకు జరగనున్న జాతీయ స్థాయి ఖేలో ఇండియా యూత్ అథ్లెటిక్స్ పోటీలకు నగరానికి చెందిన వైశాలి ఎంపికైంది. సర్దార్ పటేల్ స్టేడియంలో నిత్యం సాధన చేసే ఆమె ఇటీవల జరిగిన పలు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలలో చూపిన ప్రతిభ ఆధారంగా లాంగ్‌జంప్ విభాగంలో జాతీయ పోటీలకు ఎంపిక చేశారు. తెలంగాణ జట్టు తరుపున నలుగురు అథ్లెట్లు ఎంపిక కాగా, అందులో వైశాలి ఒకరు కా వడం విశేషం. ఈ సందర్భంగా జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన ఆమెను డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ షఫీ, కోచ్ గౌస్ తదితరులు అభినందించారు. జాతీయ పోటీలలో రాణించి ఖమ్మం జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.

## 5నుంచి రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

వైరా, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం మెరుగైన సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు వానాకాలం సాగుకు రైతులను సమాయత్తం చేసేందుకు ఈనెల 5వతేదీ నుంచి జూన్ 13వతేదీ వరకు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తామని వైరా కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రంలోని శాస్త్రవేత్తలు ఈ ఆరువారాల పాటు వారానికి రెండు రోజులపాటు ఖమ్మం జిల్లాలో ఉన్న వివిధ మండలాల్లోని రైతువేదికల్లో వ్యవసాయ, అనుబంధ అధికారుల సమన్వయంతో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. శాస్త్రవేత్తలతోపాటు ఇద్దరు వ్యవసాయ కళాశాల విద్యార్థులు కూడా పాల్గొంటారని పేర్కొన్నారు. యూరియా వాడకం తగ్గించడం, సాగు ఖర్చులను తగ్గించడం, రసాయనాలను అవసరాల మేరకే వినియోగించడం, నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడడం, వానాకాలంలో రైతులు విత్తనాలు చల్లినప్పుడు రసీదులను భద్రపర్చుకోవడం, వివిధ పంటల్లో సాగునీటిని ఆదా చేయటం, పంట మార్పిడి చేయడం, ప్రత్యామ్నాయ పంటల సాగు, చెట్ల పెంపకం, పర్యావరణాన్ని కాపాడటం లాంటి అంశాలపై శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఈ అవగాహన సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ధాన్యం కేంద్రాన్ని పరిశీలించిన అధికారులు



ఖమ్మంరూరల్, మే1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కస్నాతండాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా సహకార అధికారి గంగాధర్ గురువారం పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లు, కాటాల వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

## రుద్రాక్షల ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న దుర్గాప్రసాద్

ఖమ్మంఖానాపురంహవేలి, మే1 (ఆంధ్రజ్యోతి): అక్షయ తృతీయని పురస్కరించుకొని ఖమ్మం బైపాస్‌రోడ్‌లోని ఆర్‌ఆర్‌ఆర్ ఫంక్షన్‌హాల్లో నేపాల్ రుద్రాక్షల ప్రదర్శన ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో ఏకముఖ రుద్రాక్ష నుంచి 21 ముఖముల రుద్రాక్షల వరకు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకుడు ఓంశ్రీ నేపాల్ రుద్రాక్ష ఆర్గనైజేషన్ మేనేజింగ్ డైరక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు. వీటితో పాటు కరంగిళిమాలలు, స్పటికమాలలు, నవరత్నమాలలు, సాలిగ్రాంలు, దక్షణావృత శంకులు ఈప్రదర్శనలో ఉంచామని ఈనెల 5 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఎస్‌బీఐటీ విద్యార్థుల ఎంపిక



ఖమ్మం ఖానాపురంహవేలి,మే1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో చివరి సంవత్సరం విద్యార్థులు 22 మంది బుధవారం కళాశాలలో జరిగిన ప్రాంగణ నియామకాలలో ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. రాతపరీక్ష, గ్రూప్ డిస్కషన్స్ ద్వారా ఎంపికలు జరిగాయని, ఈసీఈ, సీఎస్ఈకి చెందిన 22 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. వీరికి వార్షిక ఆదాయం రూ.3లక్షల నుంచి రూ.6లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను చైర్మన్ తోపాటు, కళాశాల కరస్పాండెంట్ జి.ధాత్రీ,ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, డైరెక్టర్లు అభినందించారు.

# ఘనంగా మే డే

జిల్లా వ్యాప్తంగా గురువారం మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మే డే ఆవిర్భవించిన తీరును గుర్తు చేసుకున్నారు. కార్మికులు హక్కుల పరిరక్షణకు మరోసారి ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని ఏదులాపురం సీపీఐ శాఖ ఆధ్వర్యంలో సుమారు 500 ద్విచక్రవాహనాలు, ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. ఎర్రజెండాల రెపరెపల నడుమ వరంగల్ క్రాస్ రోడ్డు, ఆదిత్యనగర్, శ్రీరామ్‌నగర్, తాళ్లెసితండా, సత్యనారాయణపురం, నాయుడుపేట, పెద్దతండా తదితర ప్రాంతాల మీదుగా ఈ ర్యాలీ సాగింది. అనాసాగరంలో సీపీఎం నాయకత్వంలో వేడుకలు నిర్వహించగా, నేలకొండపల్లిలో ప్రైవేటు ఎలక్ట్రీషియన్ సంఘం ఆధ్వర్యంలో, వ్యవసాయ మార్కెట్ వద్ద బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మంగాపురంతండాలో సీపీఐ ఆధ్వర్యంలో మేడే జరిపారు. : నెట్‌వర్క్



ముజ్జుగూడెంలో మేడే వేడుకల్లో పాల్గొన్న సీపీఎం శ్రేణులు



ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జెండావిష్కరణ చేస్తున్న భాగం హేమంతరావు



రఘునాథపాలెంలో..





సీపీఎం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నున్నా, నాయకులు, టీయూసీఐ రాష్ట్రనాయకుల ఆధ్వర్యంలో ర్యాలీ



ప్రైవేటు ఎలక్ట్రీషియన్ల సంఘం ఆధ్వర్యంలో..



బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో..



ఖమ్మం త్రీటౌన్‌లో టీడీపీ ఆధ్వర్యంలో..



కార్పెంటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



సీపీఐ ఆధ్వర్యంలో వరంగల్ క్రాస్‌రోడ్డులో..



సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ..



కామేపల్లిలో..



పత్తిమార్కెట్‌లో దడవాయి సంఘం..

## విద్యుత్ వినియోగదారులు భద్రత పాటించాలి: డీఈ

నేలకొండపల్లి, మే1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ పరికరాలు వినియోగించే సమయంలో భద్రత పాటించాలని డీఈ, టెక్నికల్ బాబూరావు కోరారు. మే1నుంచి 7వరకు జరుగనున్న విద్యుత్ వారోత్సవాలను డీఈ మండల పరిధిలోని నాచేపల్లిలో గురువారం ప్రారంభించారు. తెగిపడిన విద్యుత్ తీగలు, విరిగిపడిన విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలన్నారు. వెంటనే విద్యుత్ అధికారులకు తెలపాలని కోరారు. అనుమతి, అర్హతలేని వ్యక్తులచే ఫ్యూజులను మార్పించటం, వీధిదీపాలను సరి చేయించటం కారణంగా కూడా విద్యుత్ ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఏఈ ఆపరేషన్స్‌కు క్కల రామారావు, సబ్ ఇంజనీర్ అబ్దుల్ ఖదీర్, ఎస్ఎల్ఐ రమేష్, ఎల్ఐ సత్యనారాయణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## కులగణన సామాజిక న్యాయానికి బీజం

**బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి**



ఖమ్మంబైపాస్‌రోడ్, మే1(ఆంధ్రజ్యోతి): కులగణన సామాజిక న్యాయానికి బీజం వేయగలిగే చారిత్రక ప్రక్రియ అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు అన్నారు. నగరంలోని జడ్పీసెంటర్‌లో బీసీ మోర్చా ఆధ్వర్యంలో మోదీ చిత్రపానికి క్షీరాభిషేకం చేశారు. బీజేపీ దేశవ్యాప్తంగా జనగణనతోపాటు కులగణన చేపట్టేందుకు సన్నద్ధమవుతుందన్నారు. ఇది బడుగు, బలహీనవర్గాలకు న్యాయం జరిగే దిశ ఒక కీలక అడుగు కాబోతుందన్నారు. బీసీల శాస్త్రీయ గణాంకాలు లేకపోవడంతో అనేక సంక్షేమపథకాల్లో వారికి నష్టంజరుగుతుందన్నారు.ఈకార్యక్రమంలో ఈవీ రమేష్, డాక్టర్ శీలం పాపారావు, జ్వాల నరసింహారావు, అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, శ్యామ్‌రాథోడ్,మంద సరస్వతి,రుద్ర ప్రదీప్ రాజేష్, అనిత, సుబ్బారావు పాల్గొన్నారు.

# కేఎంసీ ఉద్యోగుల లెక్క షురూ

- సిఫారసుతో బాధ్యతలు నిర్వహిస్తున్న ఉద్యోగుల్లో అలజడి
- కేఎంసీలో కదులుతున్న డొంక

ఖమ్మంసంక్షేమ విభాగం,మే1 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థలో ఎంతమంది ఉద్యోగులు పని చేస్తున్నారో అంతుచిక్కని ప్రశ్న.. రెంచన్‌గా జీతాలు తీసుకుంటున్నప్పటికీ వారు ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారో, లేదో కూడా తెలయిన వింత పరిస్థితి కేఎంసీలో నెలకొంది. దీని కారణం వారసత్వ ఉద్యోగాలు పొందిన వారు పారిశుధ్యానికి వెళ్లకుండా కార్పొరేటర్లు, అధికారులతో సిఫారసుతో కేఎంసీలో తిష్ట వేయటమే. అయితే మూడు నెలల క్రితమే కమిషనర్ అభిషేక్ అగస్త్య లెక్క తెల్చేందుకు కార్యచరణ చేశారు. ప్రజాపాలన, ఇందిరమ్మ సర్వే, రాజీవ్ యువ వికాసం, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ, ప్రాపర్టీ ట్యాక్స్ వసూళ్లు, ఎర్లీబర్డ్ కలెక్షన్ వంటి వరస కార్యక్రమాలతో కేఎంసీలోని ఉద్యోగుల డొంకను కదిలించలేక పోయారు. ఇప్పుడు కార్యక్రమాలు పూర్తి జరిగాయి. దీంతో కేఎంసీలో ఉద్యోగుల లెక్క తెల్చేందుకు అధికారులు పూర్తి స్థాయిలో కార్యచరణ చేశారు. మరో మూడు రోజుల్లో ఎంతమంది ఉద్యోగులు ఉన్నారు, ఎక్కడ పని చేస్తున్నారు అనే విషయాలు వెలుగులోకి రానున్నాయి.

**మహబూబాబాద్ వెళ్లి విచారణ**

ఖమ్మంలో పారిశుధ్య పనులు చేపట్టాల్సిన రెగ్యూలర్ మహిళా ఉద్యోగి కొంతకాలంగా తన స్థానంలో మరొకరితో విధులు నిర్వహిస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. అయితే సదరు మహిళా ఉద్యోగి మహబూబాబాద్‌లో వైద్యసేవలు పొందుతున్నట్లు సమాచారం రావటంతో ఏఎంసీ ఆహ్మద్ షఫీఉల్లా అక్కడకు వెళ్లి ప్రైవేట్ హస్పటల్ రికార్డులను తనిఖీలు చేశారు. ఒక వైపు ఖాళీగా ఉంటున్న ఉద్యోగుల వివరాలతో పాటుగా ఇతర ప్రాంతాలకు వెళ్లి అధికారులు విచారణ చేపట్టటంతో కేఎంసీలో సిఫారసుతో బాధ్యతలు నిర్వహిస్తున్న ఉద్యోగుల్లో అలజడి నెలకొంది.

## 56వ డివిజన్‌లో శంకుస్థాపనలు

ఖమ్మంసంక్షేమవిభాగం, మే1(ఆంధ్రజ్యోతి): నగరంలోని 56వ డివిజన్ కార్పొరేటర్ పైడిపల్లి రోహిణి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషితో మంజూరైన రూ.15లక్షలతో గోర్కీస్కూల్ నుంచి కృష్ణఫంక్షన్‌హాల్ వరకు సీసీ రహదారి నిర్మాణం చేపట్టనున్నారు. నాయకులు పైడిపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ పోట్ల వీరేందర్, పాటి లక్ష్మీనారాయణ, వేగినాటి ప్రసాదరావు, సంపేట శ్రీను, కొనకంచి సురేశ్, యనమద్ది వెంకటేశ్వరరావు, గంగసాని భానుప్రసాద్, పిరంగి శ్రీను, పోట్ల నర్సింహారావు, నల్లమోతు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



## ఎంపీడీవోకు వినతి

తిరుమలాయపాలెం,మే1(ఆంధ్రజ్యోతి):మండలంలోని బచ్చోడు గ్రామంలో నిజమైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరుచేయాలని కోరుతూ గురువారం ఎంపీడీవో సిలార్‌సాహెబ్‌కు వినతి పత్రం అందించారు. గ్రామానికి 35ఇళ్లు మంజూరుకాగా ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు సూచించిన వారికే ఇళ్లు మంజూరుచేస్తున్నారని, ఇల్లు లేనివారికి ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని తెలిపారు. సర్వేచేసి అర్హులైన వారికి ఇళ్లు మంజూరుచేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పీవైఎల్ జిల్లా కార్యదర్శి జి.రమేష్, నాగమణి, రేణుక, రాణి, సుకన్య, ధనమ్మ ఉన్నారు.

## పదోతరగతి ఫలితాల్లో మైస్కూల్ ప్రతిభ



విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

ఖమ్మంఖానాపురం హవేలి, మే1(ఆంధ్రజ్యోతి): బుధవారం విడుదలైన పదోతరగతి ఫలితాల్లో నగరంలోని మైస్కూల్ పాఠశాల విద్యార్థులు అద్భుత విజయాన్ని సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. పాఠశాలకు చెందిన అనుశ్రీ 540, మార్కులతో పాటు పలువురు విద్యార్థులకు అత్యుత్తమ మార్కులు సాధించారని తెలిపారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల కృషి కారణంగానే ఈ ఫలితాలు సాధించగలిగామని అన్నారు.

## ఆక్స్‌ఫర్డ్ పాఠశాల ప్రభంజనం



విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

ఆక్స్‌ఫర్డ్ పాఠశాల విద్యార్థులు పదిఫలితాల్లో ప్రభంజనం సృష్టించారని పాఠశాల ప్రిన్సిపాల్ జాఫర్ మతీన్ తెలిపారు. పాఠశాలకు చెందిన సుధ సాయి మణికంఠ 584, చందన విఘ్నేష్ 580, షేక్.రిమ్షా మెహవీష్ 565 తోపాటు 39 మందికి 500పైగా మార్కులు సాధించారని తెలిపారు. విద్యార్థులను అభినందించారు.

## ప్రగతి విద్యార్థుల విజయభేరి



విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

పదోతరగతి ఫలితాల్లో నగరంలోని ప్రగతి పాఠశాల విద్యార్థులు విజయభేరి మోగించారని పాఠశాల కరస్పాండెంట్ జి.స్వర్ణలత తెలిపారు. పాఠశాలకు చెందిన టి.మానస 555, బి.పార్థసారథి 538, తోపాటు పలువురు విద్యార్థులు 500పైగా మార్కులు సాధించారని తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు.

## పదోతరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల హవా

నేలకొండపల్లి,మే1(ఆంధ్రజ్యోతి): బుధవారం విడుదలైన పదోతరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ, మండల పరిషత్ ఉన్నత పాఠశాలలు సత్తా చాటాయి. మండల విద్యాధికారి ప్రధానోపాధ్యాయుడిగా ఉన్న ఆరెగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూరుశాతం ఫలితాలు సాధించింది. గురుకుల పాఠశాలలో 78మందికి 77మంది ఉత్తీర్ణత సాధించగా,ఒకరుఫెయిల్ అయ్యారు. రాజేశ్వరపురం జడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఎన్.భానుప్రసాద్ 546మార్కులు సాధించి మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో మొదటి స్థానం సాధించాడు. సింగారెడ్డిపాలెం గురుకుల పాఠశాలలో 29మంది 500లకు పైగా మార్కులు సాధించారు.

**గౌతమి, ఎస్ఎఫ్ఎస్‌ల్లో నూరుశాతం**



ప్రేమ్ జస్వంత్

నేలకొండపల్లి గౌతమ్, ఎస్ఎఫ్ఎస్‌లు ప్రభంజనం సృష్టించాయి. నూరుశాతం ఫలితాలను సాధించాయి. గౌతమ్ పాఠశాలకు చెందినలక్ష్మీప్రియ, రేణుకలు 556 మార్కులు సాధించారు. కొత్తకొత్తూరు ఎస్ఎఫ్ఎస్‌కు చెందిన ప్రేమ్‌జస్వంత్ 561మార్కులు సాధించాడు. గౌతమ్‌లో మొత్తం 23మంది పరీక్షకు హాజరు కాగా 23మంది ఉత్తీర్ణత సాధించారు. ఎస్ఎఫ్ఎస్‌లో 54 మందికి అందరూ ఉత్తీర్ణత సాధించారు.

**ఎస్టీ బాలికల వసతిగృహంలో నూరుశాతం**

తిరుమలాయపాలెం: ఎస్టీ బాలికల వసతిగృహంలో పదిమంది విద్యార్థులకు పరీక్షకు హాజరుకాగా అందరు ఉత్తీర్ణత సాధించారని వసతిగృహ సంక్షేమాధికారి పూలన్‌దేవి తెలిపారు. కేజీబీవీలోని 98 శాతం ఉత్తీర్ణత సాధించారు. 45 మందికి 44 మంది పాసయ్యారని స్పెషలాఫీసర్ రమాకుమారి తెలిపారు.

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- పాపటపల్లిలో ఏపీఎంపై చర్యలకు ఆదేశం



వీవీపాలెంలో ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

రఘునాథపాలెం,మే1(ఆంధ్రజ్యోతి):ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. రఘునాథపాలెం మండలం పాపటపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. శ్రీలక్ష్మీ గ్రామ సమాఖ్య ద్వారా కొనుగోలు కేంద్రం నిర్వాహణ తీరును పరిశీలించారు. తేమ శాతం తక్కువ వచ్చినా తూకం వేయట్లేదని, తాలు పేరున 6నుంచి 8శాతం కోత విధిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించి రైతులకు నష్టం కలిగేలా వ్యవహరించిన ఏపీఎంపై చర్యలు తీసుకోవాలని డీఆర్డీవో సన్యాసయ్యను కలెక్టర్ ఆదేశించారు.

**వీవీ పాలెంలో ఫుట్‌బాల్ ఆడిన కలెక్టర్**

వీవీపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫుట్‌బాల్ పోటీలను ఏర్పాటు చేశారు. పోటీలను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఫుట్‌బాల్ సర్వీస్ చేసి ప్రారంభించారు. ఆటల వల్ల ఉపయోగాలంటే అని విద్యార్థులతో మాటామంతి కలిపారు. క్రీడల వల్ల ఉపయోగాలేంటని విద్యార్థులను ప్రశ్నించారు. విద్యార్థులు కలెక్టర్‌తో మాట్లాడుతూ ప్రభుత్వం అన్నిరకాలుగా క్రీడా, విద్యా సౌకర్యాలను కల్పిస్తోందన్నారు. మంచి అవకాశాలను క్రీడలతో పాటుగా చదువులోను రాణించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ విద్యార్థులకు వివరించారు.

**ఉపాధి కూలీలు మీ మాటే వింటారమ్మా...**

రఘునాథపాలెం పల్లేదవాఖానా, వీవీపాలెం వైద్య సిబ్బందితో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో తెల్లటి దుస్తులు వేసుకొని ప్రభుత్వ వైద్యసేవలు అందిస్తే చాలా మంచిగా అనిపిస్తోంది. గ్రామాల్లో ఉపాధి కూలీల నుంచి గర్భిణుల వరకు అందరూ మీ మాటే వింటారమ్మా.. అందుకే గ్రామాల్లో మీరంటే మంచి పేరుందని కితాబునిచ్చారు. అనంతరం రఘునాథపాలెం మండల కేంద్రంలోని 108 వాహనాన్ని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తనిఖీ చేశారు. గురువారం రఘునాథపాలెం మండల పర్యటనకు వెళ్లిన కలెక్టర్ రఘునాథపాలెం గ్రామంలో ఉంచిన 108 వాహనం వద్దకు వెళ్లి ఈఎంటీ జగదీష్‌తో మాట్లాడారు. పరికరాలు, ఔషధాలు పరిశీలించారు. మండలంలో ఎక్కువ మంది ప్రజలు 108 వాహనాన్ని ఎందుకు వాడుతున్నారో తెలుసుకున్నారు. అలాగే 108 వాహనానికి మంచుకొండ పీహెచ్‌సీలో సౌకర్యాన్ని కల్పిస్తామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు.

## వెంకటగిరిలో వేసవి క్రీడాశిక్షణ ప్రారంభం

ఖమ్మంరూరల్,మే1(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని వెంకటగిరి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో వేసవి క్రీడాశిక్షణను గురువారం గ్రామ పెద్దలు, పాఠశాల ఉపాధ్యాయులు ప్రారంభించారు. వేసవి సెలవుల నేపథ్యంలో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఈ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు, శిబిరం ఇన్‌చార్జ్ వీవీ.రమణ, చైర్మన్ శ్రీదేవి, గ్రామపెద్దలు వెంకటనారాయణ పాల్గొన్నారు.

## క్రీడాకారులకు బ్యాడ్మింటన్ సంఘం చేయూత

ఖమ్మంస్పోర్ట్స్, మే1 (ఆంధ్రజ్యోతి): సర్దార్ పటేల్ ఇండోర్ స్టేడియంలో వేసవిశిక్షణ శిబిరాల్లో షటిల్ నేర్చుకునే క్రీడాకారులకు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ తరుపున చేయూత అందించనున్నట్లు సంఘం అధ్యక్షుడు కర్నాటి వీరభద్రం,కార్యదర్శి విజనంపాటి చంద్రశేఖర్, ట్రెజరర్ జట్ల శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు. టీషర్ట్‌లుఅందించడమే కాకుండా, శిక్షణ చివరిలో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు.

## ‘ఆపరేషన్ కగార్’ను నిలిపి వేయాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, మే1(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపి వేయాలని నంగారభేరీ, పూలే ఆశయసాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని జడ్పీసెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. లంబాడా హక్కుల పోరాట సమితి, నంగారభేరీ రాష్ట్రఉపాధ్యక్షుడు బానోతు బద్రునాయక్ మాట్లాడుతూ దేశీయ, పారిశ్రామిక వేత్తలకు అటవీ సంపదను కట్టబెట్టేందుకే ఈ ఆపరేషన్ కగార్ ఉద్దేశమన్నారు. ఈ చర్యతో అటవీ స్వరూపం, ఆదివాసీల అస్తిత్వం పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. పహల్గాం ఉదంతం మన మానవత్వానికి మాయని మచ్చ వంటిదన్నారు. ఈ కార్యక్రమంలో భూక్యా ఉపేంద్రబాయి, ఎస్కే నజీమా, త్రివేణి, లలితాబాయి, జయమ్మ, ఝాన్సీ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.





## సుందరయ్య ఆశయాలు స్ఫూర్తిదాయకం

బోనకల్, మే 1 (ఆంధ్రజ్యోతి): సీపీఎం జాతీయ మాజీ కార్యదర్శి, అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలు స్ఫూర్తిదాయకమని ఆ పార్టీ జిల్లా నాయకులు చింతలచెర్వు కోటేశ్వరరావు, దొండపాటి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం సుందరయ్య 112వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బలహీన వర్గాల కోసం జీవితాంతం పోరాడిన నిస్వార్ధ నేతగా ఆయన అందరి మన్ననలను అందుకున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కిలారు సురేష్, తెల్లాకుల శ్రీనివాసరావు, గుగులోతు పంతు, ఉప్పర శ్రీను, గుగులోతు నరేష్, బోయినపల్లి వీరబాబు, ఏసుపోగు బాబు, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

మధిర రూరల్ మే 1 (ఆధ్రజ్యోతి): కుటుంబ కలహాల కారణంగా ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం రాత్రి మధిర మండలం ఆత్కూరు గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. ఆత్కూరు గ్రామంలో మీనుగు పెంటయ్య భార్య మీనుగు కనకమ్మ(47) గురువారం రాత్రి ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుని మృతిచెందింది. మద్యం మత్తులో భర్త తరచే వేధింపులకు పాల్పడుతూ ఉండేవాడని, కుటుంబాల కలహాల కారణంగానే మృతిచెం దినట్లు స్థానికులు తెలిపారు. మృతురాలికి ఒక కుమార్తె ఉన్నారు. విషయం తె లుసుకున్న మధిర టౌన్ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### వ్యక్తికి తీవ్ర గాయాలు

మధిర మండలం అంబారుపేట గ్రామం వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొట్టటంతో ఈ ప్రమాదం జరిగింది. రేమిడిచర్ల గ్రామానికి చెందిన షేక్ లాలు ద్విచక్రవాహనంపై మధిర నుంచి అంబారుపేట వైపు వెళ్తుండగా అంబారుపేట గ్రామ శివారులో ఎదురుగా వచ్చిన కారు బైకును ఢీ కొనటంతో లాలుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 ద్వారా మధిరలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

## అకాల వర్షం.. అన్నదాతకు నష్టం

### మార్కెట్ యార్డులలో తడిసిన వరి ధాన్యం.. నేలకూలిన ఇళ్లు, చెట్లు, విద్యుత్‌కు అంతరాయం

అకాల వర్షానికి అన్నదాతకు నష్టం వాటిల్లింది. పలు చోట్ల మార్కెట్ యార్డులలో వరి ధాన్యం తడిసింది. రహదారులపై చెట్లు నేలకూలాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లింది.

### రైతుల ఆందోళన

మధిరరూరల్: మధిర పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో బుదవారం రాత్రి తర్వాత కురిసిన అకాలవర్షంతో కొనుగోలు కేంద్రంలో ఉన్న రైతుల వరి ధాన్యం తడిసిపోయింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మదరి మార్కెట్ యార్డులో ఐకేపీ, సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రానికి రైతులు తాము పండించిన ధాన్యంను తెచ్చారు. బుధవారం రాత్రి గాలిదుమారంతో కూడిన వర్షం పడింది. మార్కెట్‌యార్డులో ఉన్న ధాన్యం తడిసిపోయింది. తడిచిన ధాన్యాన్ని ఆర బోసుకున్నారు. ఒక్కసారిగా వచ్చిన అకాలవర్షం తమను తీవ్రంగా దెబ్బతీసిందని రైతులు దిగులు చెందుతున్నారు. టార్పాలిన్ పట్టాలు కొంతమంది రైతులు వేసినప్పటికి పెద్దగాలి కావడంతో ఆ పట్టాలు కూడా కాపాడలేకపోయాయి. అయితే కొందరు రైతులు ధాన్యాన్ని తీసుకువచ్చి వారం రోజులు అవుతున్నా కాంటాలు వేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు.

### రైతులను నట్టేట ముంచిన భారీ వర్షం

వైరా: వైరా మండలంలోని ధాన్యం రైతులను బుధవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షం నట్టేట ముంచింది. రాత్రి 11గంటల సమయంలో ఇటీవల కాలంలో మునుపెన్నడూ లేనివిధంగా అకస్మాత్తుగా భారీ ఈదురు గాలులతో కుంభవృష్టి పడింది. గత 15రోజుల్లో ఇంతకముందు నాలుగు వర్షాలు కురిసినప్పటికీ వాటికి మించి భారీ వర్షం కురిసింది. రాత్రి 11గంటల వరకు తీవ్ర ఉక్కపోత ఉన్నప్పటికీ వర్షపు చాయలు అంతగా కన్పించలేదు. దాంతో కొంతమంది రైతులు ధాన్యాన్ని కల్లాలు, రోడ్లపై ఆరబోసి టార్పాలిన్ పట్టాలు కప్పకుండా వదిలివేయడంతో ఈ వర్షానికి తడిసి ముద్దయింది. కొంతమంది రైతులు ముందు జాగ్రత్తగానే ఆరబోసిన ధాన్యంపై టార్పాలిన్, పరదా పట్టాలు కప్పుకున్నారు. అయినప్పటికీ ధాన్యం అడుగు భాగంలోకి వర్షపునీరు చేరి తడిసిపోయాయి. టార్పాలిన్, పరదా పట్టాలు కప్పని ధాన్యం వర్షపునీటిలో కొట్టుకొనిపోయాయి. ధాన్యం రాశుల కింద నిలిచిన వర్షపు నీటిని తొలగించుకొనేందుకు, తడిసిన ధాన్యాన్ని ఆరబోసేందుకు గురువారం రైతులు పడరాని పాట్లు పడ్డారు. అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో విలవిల్లాడుతున్నారు. ప్రతి నిత్యం రైతుల గుండెల్లో రైళ్ల పరుగెడుతున్నప్పటికీ అధికార యంత్రాంగానికి చీమకుట్టినట్లు కూడా లేదని వాపోతున్నారు. జిల్లాలో కేవలం రెండు, మూడు పార్‌బాయిల్డ్ రైస్‌మిల్లులు మాత్రమే ఉన్నప్పటికీ ఈధాన్యాన్ని వేరే జిల్లాల్లోని మిల్లులకు తరలించేందుకు గానూ అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రైతులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం తమను ఆదుకోవాలని ధాన్యం రైతులు కోరుతున్నారు.

### ప్రజలు అతలాకుతలం

కొణిజర్ల: రాత్రిపూట అకస్మాత్తుగా సంభవించిన గాలి, వాన భీభత్సానికి ప్రజలంతా అతలాకుతలం అయ్యారు. రాత్రిపూట రైతులు కల్లాల్లో ఆరబోసిన ధాన్యం కాపాడుకునేందుకు ఉరుకులు పెట్టారు. మండలంలోని పల్లిపాడు సమీపంలో మెయిన్‌రోడ్డు ప్రక్కన ఉన్న బారీ వృక్షం కూలి రోడ్డుపై పడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీస్‌లు అప్రమత్తమై చెట్టును తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

### రెండు కుటుంబాలకు తప్పిన ప్రమాదం

మండల పరిధిలోని తుమ్మలపల్లి గ్రామంలో బుధవారం రాత్రి సంభవించిన గాలి దుమారానికి గ్రామానికి చెందిన పూర్ణకంటి కృష్ణయ్య, కొత్తపల్లి ప్రభాకర్ ఇళ్ల రేకులు కూలి ఆస్తినష్టం జరిగింది. ఆ రెండు కుటుంబాల దంపతులు ఇంట్లోనే నిద్రిస్తున్న సమయంలో ఇళ్లు కూలటంతో అవి మీద పడకుండ పెద్ద ప్రమాదం తప్పింది. కూలిన ఇంటి దూలాలు మీద పడితే ప్రాణాలు పోయేవని బాధితులు పూర్ణకంటి కృష్ణయ్య-నాగరత్నం, కొత్తపల్లి ప్రభాకర్-సుహాసిని లు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. అదే గ్రామానికి చెందిన సొరకాయల పెద్దకృష్ణ ఇంటి పై రేకులు లేచిచాలా దూరంలో పడ్డాయి. గ్రామంలో పలు చోట్ల ఇండ్లకు రేకులు లేచిపోయాయి.

### నేలకూలిన చెట్లు

కారేపల్లి: మండలంలో బుదవారం రాత్రి వీచిన భారీ గాలిదుమారంతో పలుప్రాంతాల్లో అనేక చెట్లునేలకూలాయి. ప్రధానంగా ఇల్లెందు-ఖమ్మం ప్రధాన రహదారిలో రోడ్డుకు ఇరువైపులున్న అనేక చెట్లునేలకూలడంతోపాటు, భారీగా కొమ్మలు విరిగి ప్రధానరహదారిలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. కొమ్ముగూడెం బస్టాండ్‌వద్ద తుమ్మచెట్టు కూకటి వేళ్లతో సహా రోడ్డుకు అడ్డంగా పడింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. గాంధీనగరం గ్రామం నుంచి కారేపల్లి క్రాసురోడ్డువరకు రహదారికి ఇరువైపులా చెట్లుపడ్డాయి.

### విద్యుత్‌కు తీవ్ర అంతరాయం

భారీ గాలిదుమారంతో అనేక ప్రాంతాలలో చెట్లు కొమ్మలువిరిగి విద్యుత్‌వైర్లపై పడ్డాయి. దీంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ స్థంభాలు విరిగి నేలపై పడ్డాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాత్రంతా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మండలం మొత్తం చీకట్లోనే ఉండిపోయింది. అనేక గ్రామాలకు గురువారం సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా జరగకపోవడంతో నీళ్ల కోసం ఇబ్బందులు పడ్డారు.



మధిర మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యం



కారేపల్లి మండలం గాంధీనగరం వద్ద కూలిన చెట్లు



కొణిజర్ల మండలం తుమ్మలపల్లిలో కూలిన ఇల్లు



వైరాలో నీళ్లు పారబోస్తున్న రైతు

## ఉద్యమకారులకు మంజూరు కాని ఇళ్లు



ఆవేదన వ్యక్తం చేస్తున్న ఉద్యమకారులు

వేంసూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఉద్యమకారులు, అమరవీరులకు ఇంటి స్థలంతోపాటు ఇళ్లు కట్టిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని ప్రస్తుతం తమను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఉద్యమకారులు బండి అంజిరెడ్డి, మిరియాల రవి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం వేంసూరు మండలం కందుకూరు గ్రామంలో ఉద్యమకారుల సంఘ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజాపాలన దరఖాస్తుల్లో తెలంగాణ ఉద్యమకారులు, అమరవీరులకు 250గజాల స్థలంఇస్తామని ప్రత్యేక కాలం కేటాయిస్తామని చెప్పారని, ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్లు రాలేదని వాపోయారు. వేంసూరు మండలానికి 577ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా ఇందిరమ్మ ఇళ్ల కమిటీ అనుచరుల పేర్లను మాత్రమే ఎంపిక చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ కమిటీలు కానీ, అధికారులు కానీ ఉద్యమకారులను పట్టించుకోవడం లేదని వాపోయారు. తెలంగాణ ఉద్యమకారుల కృషి ఫలితంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ పదవులు అనుభవిస్తున్నారే తప్ప తమను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్లకు తాము అర్హులైనప్పటికీ ఉద్యమకారులను విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉద్యమకారులు, అమరవీరులకు ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యత కల్పించాలని వారు కోరారు. సమావేశంలో తుంగా కృష్ణ, జుంజునూరి శివకృష్ణ, గమిడెల్లి మోహన్‌రావు, రామకృష్ణ పాల్గొన్నారు.

## క్రీడలు మానసికోల్లాసానికి దోహదం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్

మధిరటౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహద పడతాయని మధిర మునిసిపల్ కమిషనర్ సంపత్ కుమార్ అన్నారు. గురువారం మధిర లోని ఇండోర్ స్టేడియంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని అయన ప్రారంభించారు, విద్యార్థులు వేసవి సెలవల్లో క్రీడల పట్ల ఆ సక్తి మరియు క్రీడలలో మెళుకువలు నేర్చుకునేందుకు ప్రత్యేకంగా ఈ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఇండర్ స్టేడియంలో ఉన్న వసతులను సద్వినియోగం చేసుకోవడమే కాకుండా క్రీడల్లో మెళుకువలను నేర్పేందుకు కబడ్డీ, షటిల్ కు ప్రత్యేకంగా కోచ్‌ను నియమించడం జరిగిందని ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ప్రభాకర్, కబడ్డీ, షటిల్ కోచ్‌లు ప్రవీణ్, సునిల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నూరంశెట్టి కిషోర్, మాజీ కౌన్సిలర్ మల్లాది వాసు, కాంగ్రెస్ నాయకులు పాటిబండ్ల సత్యంబాబు, బాజీ, కర్నాటి రామారావు, ఎడ్మినిస్ట్రేషన్ ఇంచార్జ్ చిన్ని, పిడి విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## సేవలు చిరస్మరణీయం: ముమ్వా



కార్యక్రమంలో పాల్గొన్న విజయబాబు

సత్తుపల్లి, మే1 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో సుదీర్ఘకాలం పాటు విధులు నిర్వహించిన యనమాల నాగరాజు సేవలు చిరస్మరణీయం, అపూర్వం, అభినందనీయమని టీజీఐడీసీ ఛైర్మన్ మువ్వా విజయబాబు అన్నారు. సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో ఏడీసీగా పదవీ విరమణ పొందిన యనమాల నాగరాజును గురువారం స్థానిక కళాభారతి ఆడిటోరియంలో ఆయన ఘనంగా సన్మానించారు. అదేవిధంగా ఆర్టీసీ యూనియన్ బాధ్యులు, రాజకీయ పార్టీ నాయకులు, పాత్రికేయులు, ప్రజాప్రతినిధులు సన్మానించి జ్ఞాపికలను బహూకరించారు. కార్యక్రమంలో టీఎంయు రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడు నామా వీరభద్రం, సెక్రటరీ సాధు సుధాకర్, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు, ఖమ్మం డివిజన్ సెక్రటరీ బీఎస్.రెడ్డితో పాటు సత్తుపల్లి డిపోలోని అన్ని సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## పేకాట రాయుళ్ల అరెస్టు

మధిరరూరల్, మే1(ఆంధ్రజ్యోతి): మధిర మండలంలోని ఖమ్మంపాడు గ్రామంలో సుబాబుల్ తోటలో పేకాట ఆడుతున్న వారిని మధిర రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ఏడుగురిని అరెస్టు చేసి కేసు నమోదుచేశారు. అరెస్టయినవారి నుంచి రూ.4190 స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

## ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి



ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న మదన్‌లాల్

వైరా, మే 1 (ఆంధ్రజ్యోతి): రబీ ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చూడాలని మాజీ ఎమ్మెల్యే బాణోతు మదన్‌లాల్ డిమాండ్ చేశారు. మండలంలోని స్నానాల లక్ష్మీపురం, సిరిపురం, నారపనేనిపల్లి, విప్పలమడక, గరికపాడు, దాచాపురం, లింగన్నపాలెం గ్రామాల్లో వర్షానికి తడిసిన ధాన్యాన్ని గురువారం మదన్‌లాల్ పరిశీలించారు. నెలరోజుల నుంచి ధాన్యం కొనుగోళ్లు సరిగా లేక రైతులు ఇబ్బంది పడుతున్నా ప్రజాప్రభుత్వమని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఈ ప్రభుత్వం రైతులను వంచిస్తుందని విమర్శించారు. ఫోన్ ద్వారా ధాన్యం రైతుల ఇబ్బందులను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయనట్లయితే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అధికారులు వెంటనే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాణాల వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జున్‌రావు, వైరా మునిసిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ ముళ్లపాటి సీతరాములు, జడ్పీ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు షేక్.లాల్‌మహ్మద్, నాయకులు కామినేని శ్రీనివాసరావు, తన్నీరు కిషోర్, ఐనాల కనకరత్నం, వాసిరెడ్డి రవి, బోస్, గుజ్జర్లపూడి దేవరాజ్, అమ్మిక రామారావు పాల్గొన్నారు.

## అమీన్‌పూర్ దర్గాను సందర్శించిన..
## వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా, మే 1 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో ప్రసిద్ధిగాంచిన అమీన్‌పూర్ దర్గాను వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ తన కుటుంబ సభ్యులతో కలిసి గురువారం సందర్శించారు. అమీన్‌పూర్ దర్గా నిర్వాహకులు ఎమ్మెల్యే ఆయన కుటుంబసభ్యులకు స్వాగతం పలికి దర్గా విశిష్టత గురించి వివరించారు. అనంతరం ఎమ్మెల్యే కుటుంబసభ్యులతో కలిసి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తెలంగాణ రాష్ట్రం ముఖ్యంగా వైరా నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రార్థనలు నిర్వహించారు. పులివెందుల, జమ్మలమడుగు నియోజకవర్గాల కాంగ్రెస్ కో-ఆర్డినేటర్లు గురువారెడ్డి, శివమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



దర్గాలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్

## మా ఇంటి-మణిదీపం

పెనుబల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణేశులపాడులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం మాఇంటి-మణిదీపం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆడపిల్లకు జన్మనిచ్చిన మళ్లపల్లి జ్యోత్స్న, అప్పారావు దంపతులను సన్మానించి స్వీట్‌బాక్సు అందజేశారు. కార్యక్రమంలో ఏసీడీపీవో మెహరున్నీసాబేగం, సూపర్‌వైజర్ మల్లేశ్వరి, పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌రావు, ఏఎన్ఎంలు నాగేశ్వరరావు, రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు ఉదయలక్ష్మీ, స్వర్ణకుమారి, ఆశకార్యకర్త రత్నకుమారి తదిరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న రాంబాబు

ఏన్కూరు, మే1 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ప్రత్యేక చొరవతో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. రాయమాదారం గ్రామంలో అకాలవర్షాలతో తడిచిన ధాన్యాన్ని గురువారం రైతుసంఘం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా బొంతు రాంబాబు మాట్లాడుతూ గన్నీసంచుల సరఫరాలో అధికారుల నిర్లక్ష్యంతోనే జిల్లాలో ధాన్యం తడిసిపోయిందన్నారు. జిల్లాలో అకాలవర్షాలకు తడిచిన లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని బేషరతుగా ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. రైతులకు అవసరమైన గన్నీ సంచుల సరఫరాలో ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దుగ్గి కృష్ణ, జిల్లా నాయకులు అంబటి శ్రీనివాసరెడ్డి, మండల కార్యదర్శి గుండా సత్యనారాయణరెడ్డి, సొసైటీ డైరెక్టర్ కొనకంచి వెంకటేశ్వరరావు, మాడపాటి రాజేష్, బిక్షం, చంద్రయ్య, కనకరావు పాల్గొన్నారు.

## ఘనంగా మే డే

కార్మిక దినోత్సవం మే డేను గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శనలు నిర్వహించడంతోపాటు.. జెండాలు ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో నేతలు మాట్లాడుతూ.. కార్మికుల శ్రమశక్తిని పాలకులు దోచుకుంటున్నారని, వారి శ్రమకు తగ్గ ఫలితం దక్కటం లేదని ఆరోపించారు. వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు చొరవ చూపాలని డిమాండ్ చేశారు.



సత్తుపల్లి గ్రంథాలయం వద్ద..



ముష్టికుంట్లలో నిర్వహించిన ర్యాలీ



ఎర్రుపాలెంలో నిర్వహించిన వేడుకలు



మధిరలో సీపీఎం ఆధ్వర్యంలో..



కల్లూరు సీఐటీయూ ఆధ్వర్యంలో




వీఎం బంజరులో




తల్లాడలో ర్యాలీ



వైరాలో నిర్వహించిన ప్రదర్శన